నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
శుక్రవారం | ఆగస్టు 02, 2024 | www.navatelangana.com

విద్యుత్‌శాఖ పొలంబాట



మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని కుప్రియాల్ గ్రామంలో గురువారం "విద్యుత్ శాఖ - పొలంబాట" కార్యక్రమాన్ని రైతుల సమక్షంలో నిర్వహించారు. సుమారుగా 30 మంది రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. "విద్యుత్ శాఖ - పొలం బాట" ముఖ్య ఉద్దేశాన్ని ఎస్ఈ రమేష్ బాబు వివరించారు. వంగిన, విరిగిన లేదా కిందకు వేలాడుతూ ప్రమాదకంగా ఉన్న లూజు విద్యుత్ లైన్లను సరి చేస్తామన్నారు. నాణ్యమైన విద్యుత్ అందించడం కోసం కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో డీఈ సలియా నాయక్, ఏడీఈ నరేష్ కుమార్, ఏఈ ధర్మారెడ్డి, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

కందకుర్తి గోదావరిలో జలకళ

నవతెలంగాణ-రెంజల్



నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం కందకుర్తి గోదావరి త్రివేణి సంగమం జలకళతో ఉట్టిపడుతోంది. గురువారం కందకుర్తి గోదావరి త్రివేణి సంగమం వద్ద భారీ వరద నీరు రావడంతో జలకళ సంతరించుకుంది. మహారాష్ట్రలో భారీగా వర్షాలు కురుస్తూ ఉండడంతో పెద్ద మొత్తంలో కొత్త నీరు రావడంతో కందకుర్తి గోదావరి త్రివేణి సంగమం జలకళ ఉట్టిపడుతోంది. కందకుర్తి గోదావరిలోని రాతి శివాలయం సగం వరకు నీరు వచ్చింది.

ఫేక్ కాల్స్‌తో తస్మాత్ జాగ్రత్త..

- **ఇటీవల మండలంలో వెలుగుజూసిన మోసాలు**

నవతెలంగాణ-కోటగిరి

కోటగిరి ఉమ్మడి మండలంలో గత మూడు రోజుల నుంచి స్మార్ట్ ఫోన్ ఉపయోగిస్తున్న వారికి ఫేక్ ఫోన్ వాట్సాప్ కాల్స్ చేస్తూ సైబర్ మోసగాళ్లు ఇబ్బందులకు గురిచేస్తున్నారు. వారి కుటుంబీకుల వివరాలు తెలుపుతూ 'మీ కుటుంబ సభ్యులు ఆపదలో ఉన్నారు.' అంటూ భయపెట్టి మరీ డబ్బులు వసూలు చేస్తున్నారు. గత రెండు రోజుల క్రితం కోటగిరి గ్రామానికి చెందిన ఒకరికి 'తాము సిబిఐ ఆఫీసు నుంచి మాట్లాడుతున్నాం. మీ అబ్బాయి డ్రంకెన్‌డ్రైవ్ కేసులో దొరికాడు. రూ.5వేలు ఆన్‌లైన్‌లో వేయండి. లేనియెడల పెద్ద మొత్తంలో కేసు అవుతుంది.' అంటూ బెదిరించడంతో రూ.5000 వేసిన తర్వాత తిరిగి మరల రూ.30వేలు రెండు విడుతలుగా వెంటనే వేశారు. వారి కుమారుడు ఏడుస్తున్నట్లుగా ఫోన్‌లో వినిపించడం.. దాని ద్వారా నిజంగా ఇబ్బందుల్లో ఉన్నారని భ్రమలో పడి డబ్బులు వేసినట్లుగా బాధితులు పేర్కొన్నారు.

అదేవిధంగా కోటగిరి మండల కేంద్రంలో పలువురికి ఫోన్‌చేసి చేసి 'మీ అబ్బాయి మా దగ్గర ఉన్నారు. ఆపదలో ఉన్నాడు'. అంటూ ఏడ్చినట్లుగా వారిని నమ్మించారు. పక్కనే వారి అబ్బాయి ఉన్నప్పటికీ తమ దగ్గర ఉన్నారని చెప్పడంతో బాధితులు పోలీస్‌స్టేషన్‌కు సంబంధిత బాధితులు వెళ్లి విషయాన్ని తెలపడంతో అది ఫేక్‌కాల్‌గా గుర్తించారు. ఉమ్మడి మండలంలో గత రెండు రోజుల నుంచి హాట్‌టాఫిక్‌గా మారింది. వారి వాట్సాప్ కాల్‌లో పోలీసు దుస్తుల్లో ఉన్న వ్యక్తి ఫోటో ఉండటం బాధితులకు ఆందోళన కలిగించింది. బాధితులు నిజమే అనుకొని డబ్బులు వేశారు. ఈ ఘటనపై పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. ఈ విషయంపై గురువారం ఎస్ఐ సందీప్, సీఐ జయేశ్‌రెడ్డి బాధితుల నుంచి సమాచారం సేకరించి దర్యాప్తు చేస్తున్నారు. పలుమార్లు గ్రామాలలో, కళాశాలలో సైబర్ నేరాల పట్ల జిల్లా పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ స్మార్ట్‌ఫోన్ వినియోగదారులు మోసపోతున్నారని, ఈ రకమైన కాల్స్ వచ్చినప్పుడు 1930 నెంబర్ కాల్ చేయాలని పోలీసులు పేర్కొంటున్నారు. ఫేక్‌కాల్స్‌తో జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు.



రామారెడ్డి తహసీల్దార్‌గా కె.సువర్ణ



నవతెలంగాణ-రామారెడ్డి

రామారెడ్డి తాహసీల్దార్‌గా కె.సువర్ణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. రామారెడ్డి తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వహించిన లక్ష్మణ్ బదిలీపై ఆర్డిఓ కార్యాలయంలో డిటిగా వెళ్లారు. బాన్సువాడ ఆర్డీవో కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ అధికారిగా పనిచేసిన కే సువర్ణ రామారెడ్డి తహసీల్దారుగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో డిటి లక్ష్మణ్, అధికారులు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే..

- **బురదమయంగా రోడ్లు**

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్



బురదమయంగా మారిన రోడ్డు

పెద్దకొడప్‌గల్ మండలంతో పాటు వివిధ గ్రామాలకు వెళ్లే రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చినుకు పడితే చిత్తడిగా మారి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని వివిధ గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో రోడ్డు గుంతలమయంగా మారి విద్యార్థులతో పాటు వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి వెళ్లే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



వర్షం పడి గుంతల్లో నీరు నిలుస్తుండటంతో గుంతలు గమనించక వాహనదారులకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని రోడ్లపై ప్రయాణించాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నామ ఆందోళన చెందుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

కంకరతేలి బురదమయంగా రోడ్లు..

పలు గ్రామాల్లోకి వెళ్లేదారులు దయనీయంగా మారి మండల కేంద్రం నుంచి కాటేపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు గుంతలతో కంకర తేలి బురదమయంగా మారింది. బేగంపూర్ గ్రామంలో అంతర్గత రోడ్లపై బురద పేరుకుపోయి ప్రాథమిక పాఠశాల ముందు పేరుకపోయిన బురదతో దుర్గంధం వెదజల్లుతోంది. దోమలు వ్యాపిస్తున్నాయి. వడ్లం గ్రామంలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. అదేవిధంగా వడ్లం నుంచి పెద్ద దేవిసింగ్ తాండకు వెళ్లే దారి కూడా గుంతలు ఏర్పడటంతో అధ్వాన్న పరిస్థితి నెలకొంది. పలు గ్రామపంచాయతీల రోడ్లు వర్షం కురిస్తే చాలు బురదమయమవుతున్నాయి. టిప్పర్లతో తారురోడ్డు పూర్తిగా గుంతలమయంగా కావటంతో మట్టి పోశారు. వర్షాలకు రోడ్డు మొత్తం బురదగా మారి ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. వర్షం పోయిందంటే దుమ్ముతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాగా గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎన్నికల ముందు ఆయా గ్రామాల్లో రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసినప్పటికీ ఎన్నికల్లో ఆ పార్టీ ఓటమిపాలు కావటంతో పనులు శంకుస్థాపనకే పరిమితమయ్యాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్ల నిర్మాణానికి పూనుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రామారెడ్డి కళాశాల ప్రిన్సిపాల్‌గా నారాయణ



నారాయణని సన్మానిస్తున్న అధ్యాపకులు

నవతెలంగాణ-రామారెడ్డి

రామారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా నారాయణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ప్రిన్సిపాల్‌గా పనిచేసిన మధు శ్రీవాత్సవ దౌల్తాబాద్ జూనియర్ కళాశాలకు బదిలీపై వెళ్ళగా.. ఆయన స్థానంలో ఐలాపూర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేసిన నారాయణ బాధ్యతలు స్వీకరించారు. దీంతో అధ్యాపకులు ఆయనకు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ.. కళాశాలను అన్ని రంగాల్లో ముందుంచుతామని, కళాశాల ఉన్నతి కోసం తోడ్పాటునందిస్తామని అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ కళాశాల ప్రిన్సిపాల్‌గా శంకర్ బాధ్యతలు స్వీకరణ



సన్మానించిన పలువురు

నవతెలంగాణ-దోమకొండ

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా జి.శంకర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన జైపాల్‌రెడ్డి బదిలీపై వెళ్లడంతో మహబూబ్‌నగర్ జిల్లాలోని అమానుగల్ జూనియర్ కళాశాల నుంచి బదిలీపై వచ్చినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శంకర్ మాట్లాడుతూ.. కళాశాల అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేసి, విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల లెక్చరర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల పత్రాలను తప్పనిసరిగా కలిగి ఉండాలి

- **ఏసిపి శ్రీనివాస్**

నవతెలంగాణ-బోధన్



తనిఖీ చేస్తున్న పోలీసులు

వాహనాలకు సంబంధించిన పత్రాలను వాహనదారులు తప్పనిసరిగా కలిగి ఉండాలని బోధన్ ఏసిపి శ్రీనివాస్ అన్నారు. గురువారం బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్ చౌరస్తాలో వాహనాలను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బోధన్ పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా వాహనాలను పకడ్బందీగా తనిఖీ చేయాలని బోధన్ పోలీసులను, ట్రాఫిక్ పోలీసులను ఆదేశించారు. వాహనదారులు ఇష్టరీతినా వాహనాలు నడపకుండా ట్రాఫిక్ నిబంధనలను అనుసరించి వాహనాలు నడపాలని సూచించారు. అలాగే సెల్‌ఫోన్ మాట్లాడుతూ.. మైనర్లు వాహనాలు నడపడం, రాంగ్ రూట్‌లో వాహనాలు నడిపిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ తనిఖీలలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ట్రాఫిక్ సిఐ చందర్ రాథోడ్, పట్టణ సీఐ వీరయ్య పాల్గొన్నారు.


సొసైటీ అధికారుల నిర్లక్ష్యం..

- **అర్హులైనా.. రుణమాఫీకాని వైనం**
- **రికార్డుల్లో ఆలస్యంగా నమోదు చేయడమే కారణం**
- **నష్టపోయిన పలువురు రైతులు**

నవతెలంగాణ-మాక్లూర్

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని ఎన్నికల్లో హామీనిచ్చిన విషయం తెలిసిందే. ఇచ్చిన హామీ మేరకు డిసెంబర్ 9, 2023 వరకు క్రాప్‌లోన్ తీసుకున్న వారికి మూడు దశలుగా రైతులకు రుణమాఫీ ప్రకటించింది ప్రభుత్వం. అందులో భాగంగా మొదట దశగా రూ.లక్ష లోపు, రెండవసారి రూ.1.50 లక్షల వరకు, మూడోసారి రూ.2లక్షల రుణమాఫీ ఆగస్ట్ 15లోపు పూర్తి చేయనుంది. అందులో మొదటి, రెండవ దశల రుణమాఫీని ప్రకటించింది.



> **సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి**
>
> 
>
> సకాలంలో రికార్డుల్లో నమోదు చేయని సొసైటీ సిబ్బందిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి. 27 సెప్టెంబర్ 2023న రూ.62 వేలు తీసుకున్నా. సొసైటీ రికార్డులో 21 డిసెంబర్ 2023 నమోదు చేశారు. క్రాప్‌లోన్ రుణమాఫీ అర్హుడనై కూడా రుణమాఫీ రాలేదు. ఇందుకు కారణమైన సొసైటీ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి.
>
> **- పదాల ప్రసాద్ గౌడ్, రైతు, మాక్లూర్.**

మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘంలోని రైతులు ప్రభుత్వం ప్రకటించిన డిసెంబర్ 09, 2023 లోపు తీసుకున్న వారి వివరాలు తరువాత తీసుకున్నట్టు రికార్డుల్లో నమోదు చేశారు. దీంతో రైతులు రుణమాఫీకి అర్హులైనప్పటికీ.. వారికి రుణమాఫీ కాలేదు. మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘంలో ఐదు వేల మంది సభ్యులున్నారు. అందులో మొదటి సారిగా 280 మందికి రూ.81.96 లక్షలు, రెండవసారి 124 మందికి రూ.60 లక్షలు రుణమాఫీ వచ్చింది. రెండు దఫాల్లో 88 మంది రికార్డులు ఆలస్యంగా చూపించడం వల్ల రూ.46లక్షలు రుణం రావాల్సింది రాలేదు. తమ రుణమాఫీ రాలేదని రైతులు సొసైటీ చుట్టూ, అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ఎవ్వరూ కూడా సరైన సమాధానం చెప్పడం లేదు. అధికారుల నిర్లక్ష్యం వల్ల రైతులు నష్టపోవాల్సి వస్తుంది. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి సరిగ్గా విధులు నిర్వహించని సొసైటీ సిబ్బందిపై చర్యలు తీసుకొని, రైతులకు న్యాయం చేయాలని స్థానికులు, రైతులు కోరుతున్నారు.

> **నమోదుచేయకపోవడంతోనే నష్టపోతున్నాం**
>
> 
>
> ప్రభుత్వం నిర్ణయించిన సమయంలోనే రుణం తీసుకున్నప్పటికీ సొసైటీ సిబ్బంది సకాలంలో రికార్డుల్లో నమోదు చేయకపోవడంతో మా రుణమాఫీ రాలేదు. 27 అక్టోబర్ 2023న రూ.లక్ష 20వేలు రుణం తీసుకుంటే సొసైటీ సిబ్బంది 23 డిసెంబర్ 2023లో నమోదు చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన తేదీకంటే ముందే రుణం తీసుకున్నా.. సొసైటీ రికార్డుల్లో రెండు నెలల ఆలస్యం రికార్డులో నమోదు చేశారు. దీంతో రుణమాఫీ కాలేదు.
>
> **- గొల్ల ఒడ్డెన్న, రైతు, మామిడిపల్లి.**

ప్రాచీన కట్టడాలు

భావితరాలకు గుర్తుంటాయి

- **పునరుద్ధరించడం అభినందనీయం**
- **కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సాంగ్వన్**

నవతెలంగాణ-లింగంపేట్

ప్రాచీన చారిత్రక కట్టడాలు భావితరాలకు గుర్తుంటాయని కలెక్టర్ ఆశిష్ సాంగ్వన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో చారిత్రక కట్టడమైన నాగన్నగారి బావిని కలెక్టర్ ఆశిష్ సాంగ్వన్ ఇన్ఫోసిస్ వైస్ ప్రెసిడెంట్ కల్పనా రమేష్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. చారిత్రక కట్టడాలను పరిరక్షించడానికి ఇన్ఫోసిస్ సంస్థ ముందుకురావడం అభినందనీయమని అన్నారు. ప్రాచీన కట్టడాలను భావితరాలకు తెలియజేయడానికి స్వచ్ఛంద సంస్థలు వాటిని పునరుద్ధరించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. చారిత్రక కట్టడాలు భావితరాలకు గుర్తించిన పునరుద్ధరించడం అభినందనీయమని అన్నారు. జిల్లా వ్యాప్తంగా చారిత్రాక కట్టడాలు చాలా ఉన్నాయని, వాటిని వెలికితీస్తున్నామని తెలిపారు. పునరుద్ధరించడానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని పిలుపునిస్తున్నామన్నారు. నాగన్నగారి మెట్ల బావికి చరిత్ర ఉందన్నారు. ఉపాధి హామీ ద్వారా నాగన్నగారి బావికి వెళ్లడానికి పర్మేషన్ రోడ్డు వేయాలని అధికారులకు చెప్పారు. రోడ్డుకిరువైపులా అవెన్యూ ప్లాంటేషన్ ద్వారా మొక్కలు నాటాలని సూచించారు. నాలుగు హైమాస్ లైట్లు ఏర్పాటు చేయాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. బావి చుట్టూ నిర్మిస్తున్న రక్షణ కంచెను పరిశీలించారు. త్వరలోనే ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా పునరుద్ధరించబడిన ఈ బావిని ప్రారంభించనున్నట్టు వివరించారు. పనులు వేగంగా పూర్తిచేయాలని ఎంపీడీవో నరేష్, పంచాయతీరాజ్ డిప్యూటీ ఈఈ గిరి, ఏఈ రాకేష్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ మలహరి, ఏపీఎం శ్రీనివాస్, ఏపీవో అన్నపూర్ణ, పంచాయతీ కార్యదర్శి శ్రావణ్ కుమార్, ఉపాధి హామీ సిబ్బంది తదితరులున్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్

బాధితుల సమస్యలపై

తక్షణమే స్పందించాలి

- **కొత్త చట్టాలపై అవగాహన కల్పించాలి**
- **కామారెడ్డి ఎస్పీ సింధు శర్మ**

నవతెలంగాణ-బాన్సువాడ (నసురుల్లాబాద్)



మాట్లాడుతున్న ఎస్పీ సింధు శర్మ

పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితుల పట్ల తక్షణమే స్పందించాలని జిల్లా ఎస్పీ సిహెచ్.సింధుశర్మ అన్నారు. బుధవారం సాయత్రం బాన్సువాడ పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ సింధుశర్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. టౌన్, రూరల్ పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన వివరాలను స్థానిక సీఐని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలను తీర్చాలని, ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందిస్తూ, బాధితులకు తగు న్యాయం జరిగేలా పనిచేయాలని ఆదేశించారు. దొంగతనాలు జరగకుండా పగలు, రాత్రి పెట్రోలింగ్ నిర్వహించాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రజలకు, వ్యాపార సముదాయాల నిర్వహకులకు అవగాహన పెంచాలన్నారు. సైబర్ నేరాలపట్ల ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తూ ప్రచారం చేయాలని ఆదేశించారు. కొత్త చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తూ నివారణా చర్యలు చేపట్టాలని తెలిపారు. సైబర్ నేరాల బారిన పడకుండా ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. వీరి వెంట బాన్సువాడ టౌన్ ఎస్‌హెచ్ఓ కృష్ణ, రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఎస్సైలు, ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా కైసర్ పాషా

కోటగిరి : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా కైసర్‌పాషా గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న అనిల్ కుమార్ నిజామాబాద్‌కు బదిలీ కావడంతో ముథోల్ జూనియర్ కళాశాల నుంచి కోటగిరికి వచ్చారు. కళాశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

ఇంటింటికి మొక్కలు పంపిణీ

నవతెలంగాణ-ధర్పల్లి

మండలంలోని సీతాయిపేట గ్రామములో గురువారం ఇంటింటికి మొక్కలు పంపిణీ చేసినట్లు ఎంపిడిఓ బాలకృష్ణ తెలిపారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ.. ప్రతి కుటుంబం మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. మానవ మనుగడకు చెట్లు ఎంతో అవసరమని అన్నారు. ప్రతిఒక్కరు తమ బాధ్యతగా తీసుకొని నీరు పోసి ఏపుగా పెరిగేందుకు సహకరించాలని అన్నారు.


మొక్కలు పంపిణీ చేస్తున్న ఎంపిడిఓ బాలకృష్ణ

ఎల్ఈడి ట్యూబ్‌లైట్ మేకింగ్ వర్క్‌షాప్

నవతెలంగాణ-ఏర్గట్ల

నిజామాబాద్‌లోని రాధాకృష్ణ పాఠశాల కసాబ్ గల్లీలోని జరిగిన ఎల్ఈడీ ట్యూబ్ లైట్ మేకింగ్ వర్క్‌షాప్‌లో భాగంగా గురువారం ఏర్గట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు వైష్ణవి, నిఖిత, ప్రభాస్ పాల్గొన్నారని ప్రధానోపాధ్యాయులు కృష్ణాచారి తెలిపారు. వీరికి భౌతిక రసాయన ఉపాధ్యాయులు గాండ్ల రాజశేఖర్ గైడ్‌గా వ్యవహరించారని అన్నారు. ఈ వర్క్‌షాప్‌లో ఎల్ఈడీ ట్యూబ్‌లైట్, కంపోస్టు ఎరువులు తయారుచేసే పద్ధతి, వాటి ఉపయోగాలను విద్యార్థులు నేర్చుకుని, పాఠశాలలో నేర్పించారని ప్రధానోపాధ్యాయులు అన్నారు.


వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులు

వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలి

- ఎంపీఓ


మాట్లాడుతున్న ఎంపీఓ

నవతెలంగాణ-బాల్కొండ

మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీఓ గంగా మోహన్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, గ్రామీణ ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీఓ గంగామోహన్ మాట్లాడుతూ.. గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న వన మహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. గ్రామానికి కేటాయించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. వర్షాకాలం గ్రామాల్లో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా పంచాయతీ కార్యదర్శులు ఎప్పటికప్పుడు పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. దోమల నివారణ కోసం ప్రతి వార్డులో మందులను పిచికారి చేయాలని అన్నారు. మహిళా సంఘాల ద్వారా ప్రతి ఇంటికి మొక్కలు పంపిణీ చేయాలని, 100 శాతం సంరక్షించాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామీణ ఉపాధి హామీ ఏపీవో ఇందిర, సాంకేతిక సహాయకులు గ్రామపంచాయతీ కార్యదర్శులు గ్రామీణ ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం మత్తులో ఆత్మహత్య


నవతెలంగాణ-భీంగల్‌రూరల్



భీంగల్ మండలంలోని కేసీఆర్ కాలనీలోని ఓయువకుడు ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై హరిబాబు తెలిపారు. షేక్ అర్షద్, (36) పెయింటర్‌గా పనిచేసేవాడు. వచ్చిన డబ్బులతో మద్యం తాగేవాడు. ఈక్రమంలో బుధవారం రాత్రి బాగా తాగి ఇంటికి రాగా మృతుని తల్లి, తమ్ముడు ఎందుకు తాగుతాతున్నావని అడిగినందుకు వారితో గొడవ పడ్డాడు. భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతుని సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

తెలంగాణలో హ్యాండ్లూమ్ టెక్నాలజీని స్థాపించండి

- కేంద్ర మంత్రి గిరి రాజ్ సింగ్‌కు వినతి


కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న భోగశ్రావణి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

చాలా కాలంగా పెండింగ్లో ఉన్న ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్‌టి)ని తెలంగాణలో స్థాపించాలని, కేంద్ర జౌళి, టెక్స్‌టైల్స్ శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌ని, నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు అర్వింద్‌తో కలిసి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి విన్నవించారు. ఈ సందర్భంగా ఢిల్లీలోని మంత్రి కార్యాలయంలో భేటీ అయి చేనేత పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. తెలంగాణ ఇక్కత్ డిజైన్లకు ప్రసిద్ధి అని, మార్కెట్లో అసలు ఇక్కత్ చీరలు రూ. 8000 ధర ఉంటుందని కానీ ప్రింటెడ్ ఇక్కత్ చీరలు కేవలం 300 రూపాయలకే లభించడంతో, చేనేత కార్మికుల జీవనోపాధి మీద తీవ్ర ప్రభావం పడుతుందని అన్నారు. మన సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవడానికి నేతన్నలకు భరోసా కల్పించడానికి ప్రింటెడ్ చీరల ఉత్పత్తి, విక్రయాల మీద కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. చేనేత ఉత్పత్తులపై జీఎస్టి విధించినప్పటి నుండి నేతన్నలు అదనపు ఆర్థిక భారంతో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కాబట్టి చేనేత ఉత్పత్తులపై జీఎస్టీని తొలగించాలని ఆమె కోరారు. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఇక్కత్ కళకు, గద్వాల్ చీరలకు, వరంగల్ దుర్రీలను ఉత్పత్తి చేసే అసాధారణ కళ తెలంగాణ నేతన్నల సొంతమని అన్నారు. కాబట్టి తెలంగాణలో పరిశోధన, అభివృద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆమె కోరారు. అనంతరం భోగ శ్రావణి పోచంపల్లి శాలువాతో మంత్రికి సన్మానించారు. ఆయన ఆసక్తిగా గమనిస్తూ తెలంగాణ వచ్చినప్పుడు తప్పకుండా పోచంపల్లిని సందర్శిస్తానని, అదేవిధంగా విన్నపాల మీద తగు చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా తెలంగాణ నేతన్నల తరపు నుండి ఆమె ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చాలి

నవతెలంగాణ-మాక్లూర్

రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడుస్తున్నా ఎన్నికల్లో ఇచిన్న హామీలను నెరవేర్చడం లేదని వెంటనే హామీలను నెరవేర్చాలని భారతీయ జనతా పార్టీ జిల్లా కిషన్ మోర్చ అధ్యక్షులు తిరుపతి రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని తహశీల్దార్ షబ్బీర్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు రూ. రెండు లక్షల రుణమాఫీ చేయాలని, కౌలు రైతుకు రూ. 15 వేలు, కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన ఫసల్ బీమా యోజన అమలు చేయాలనీ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు సురేష్ నాయక్, జిల్లా కిసాన్ మోర్చా కార్యదర్శి ముప్పేడి గంగారెడ్డి, మండల కిసాన్ మోర్చా అధ్యక్షులు నల్లా గంగా మోహన్, కార్యదర్శి సంతోష్, ఆర్మూర్ ఓబిసి మోర్చా కన్వినర్ గంగోని వినోద్, బీజేపీ కోశాధికారి %ఒ% శక్తి కేంద్రం ఇంచార్జి దేదావత్ రమేష్ నాయక్, మండల ఉపాధ్యక్షులు మామూళ్ళ రవి యాదవ్, ప్రధాన కార్యదర్శి మాదరి రాజేశ్వర్, అధికార ప్రతినిధి అశోక్ నాయక్, మండల ఎస్సీ మోర్చా అధ్యక్షులు గుత్ప రాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డబల్ బెడ్ రూమ్ ఇండ్లను పంపిణీ చేయాలి

- సిపిఎం కార్యదర్శి రమేష్ బాబు డిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

డబల్ బెడ్ రూమ్ ఇండ్లను పేదలకు పంపిణీ చేయాలని సిపిఎం కార్యదర్శి రమేష్ బాబు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా అదనపు కలెక్టర్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో గత అనేక సంవత్సరాలుగా పేదలు ఇండ్లు, ఇండ్ల స్థలాల కోసం దరఖాస్తులు చేసుకున్నప్పటికీ గత ప్రభుత్వం పేదలకు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. అదేవిధంగా నాలుగు సంవత్సరాల క్రితం నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇండ్లను పేదలకు పంపిణీ చేయడంలో నిర్లక్ష్యం వహించటం వలన ఆ ఇండ్లు పూర్తయి సంవత్సరాలు గడిచినప్పటికీ వాటిని పేదలకు ఇవ్వకపోవడంతో వాటి తలుపులు, కిటికీలు దొంగలించబడుతున్నాయని తెలియజేశారు. అదేవిధంగా అక్కడ అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాలుగా మరి ఆ ప్రాంతాల్లో మహిళలకు రక్షణ లేకుండా ఉందన్నారు. జిల్లాలో అసంపూర్తిగా వందలాది డబల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మాణాన్ని ఆపేయడం జరిగిందని కొద్దిపాటి నిధులను విడుదల చేస్తే అవి కూడా పూర్తయి పేదలకు పంపిణీ చేయడం సులభం అవుతుందని పేర్కొన్నారు. జిల్లాలో వేలాదిమంది నిరుపేదలు ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారని వాటిని గత ప్రభుత్వం 58 జీవో ప్రకారం రెగ్యులరైజేషన్ కోసం అనుమతించి దరఖాస్తు పెట్టుకున్న వారికి పేదలకు మాత్రం పట్టాలు ఇవ్వలేదని ధనవంతులకు 59 జీవో కింద అనుమతించారని ఇప్పటికైనా ఈ ప్రభుత్వం దరఖాస్తు చేసుకున్న పేదలందరికీ పట్టాలను ఇచ్చి ఇండ్ల నిర్మాణానికి ఐదు లక్షల రుణం మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకున్న పేదలను కొంతమంది అధికార పార్టీ దళారులు పేదలను అక్కడి నుంచి తొలగించి వాటిల్లో అక్రమ వ్యాపారాలను కొనసాగిస్తున్నారని వారి పైన చర్యలు తీసుకొని ఆ భూములు పేదలకు దక్కేటట్టు చూడాలని డిమాండ్ చేశారు. తప్పకుండా పై సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించేటట్టు కృషి చేస్తానని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతినిధులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కటారి రాములు, నాయక్ వాడి శ్రీనివాస్, పద్మ, సతీష్, తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం కార్యదర్శి రమేష్ బాబు

జిజిహెచ్‌లో 9 కోట్ల నష్టంపై అధికారులు నిద్ర వీడరా..

- టిడిపి నిజామాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు యాదగౌడ్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్)లో డేటా ఎంట్రీ ఆపరేటర్లు సక్రమంగా విధులు నిర్వహించకపోవడంతో జీజీహెచ్‌కు 9కోట్ల నష్టం వాటిల్లిందని, పలు పత్రికల్లో వచ్చిన ఇప్పటివరకు అధికారులు ఇంకా నిద్ర వీడటం లేదని తెలుగుదేశం పార్టీ నిజామాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు దేగాం యాదగౌడ్ అవేదన వ్యక్తం చేశారు. గురువారం టిడిపి పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... స్థానికంగా ఉండే ఎంఎల్ఏలు ప్రతి ఒక్కరూ తమ నియోజక వర్గాల్లో ఉండే ప్రతి ప్రభుత్వ హాస్పిటళ్లను సందర్శించి సౌకర్యాల గురించి ఆరా తీయలని డిమాండ్ చేశారు. ప్రతి సంవత్సరం ఆస్పత్రులకు కోట్ల రూపాయల ఫండ్ వస్తున్న ఆసుపత్రులు అభివృద్ధి కావడంలేదని వచ్చిన ఫండ్ అసలు ఏమైతున్నట్టని మండిపడ్డారు. గత కొన్ని రోజులుగా నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్)లో ఆరోగ్యశ్రీలో జరిగిన సుమారు 9కోట్ల కుంభకోణం గురించి పత్రికల్లో వస్తున్న అధికారులు ఇప్పటివరకు పట్టించుకోకుండా చోద్యం చేస్తున్నారని అన్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధుల దృష్ట్యా ప్రభుత్వాసుపత్రుల్లో సరైన సౌకర్యాలు లేక, పరిశుభ్రత లేక, అందుబాటులో డాక్టర్లు లేక, ప్రైవేటు ఆసుపత్రికి వెళితే అక్కడ నిండా దోచుకుంటున్నారని మండి పడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం వీటిపై దృష్టి సారించి ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందేలా చూడాలని కొరారు. కార్యక్రమంలో టౌన్ ప్రెసిడెంట్ అంబిక సత్యనారాయణ, శంకర్ ముదిరాజ్, లవంగ రాజు, స్వామి, గంగోనే రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టిడిపి నాయకులు

సీఎం దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-భీంగల్

బుధవారం అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీత లక్ష్మారెడ్డిపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన చేసిన అనుచిత వ్యాఖ్యల కు నిరసనగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం పట్టణ కేంద్రంలోని సుమంగళి చౌరస్తా వద్ద సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు నర్సయ్య మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతిలో ఆడబిడ్డలకు ప్రత్యేక గౌరవం, స్థానం ఉందన్న కనీస సోయి లేకుండా సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీత లక్ష్మారెడ్డిని ఉద్దేశించి ఆడబిడ్డలను నమ్ముకుంటే ఆగమైతావంటూ, వారిని నమ్ముకుంటే ముంచుతారంటూ. జీవితం బస్టాండ్ పాలవుతుందంటూ అసెంబ్లీ సాక్షిగా తన స్థాయి మరిచి చేసిన నీచమైన వ్యాఖ్యలను ప్రతి ఒక్కరూ ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. జీవితంలో ఎదగాలనుకుంటున్న ప్రతి ఒక్క మహిళకు, ఆడబిడ్డకు ఈ వ్యాఖ్యలు అవమానకరమన్నారు.

రేవంత్ రెడ్డి వెంటనే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకొని అసెంబ్లీ సాక్షిగా తెలంగాణ ఆడబిడ్డలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని నర్సయ్య డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు దొనకంటి నర్సయ్య, మాజీ ఎంపీపీ ఆర్మూర్ మహేష్, మున్సిపల్ కౌన్సిలర్లు బొదిరే నర్సయ్య, మూత లింబాద్రి, మల్లెల ప్రసాద్, పర్స నవీన్, మాజీ ఎంపీటీసీలు తోట సాయి ప్రసన్నకుమార్, చిన్నోళ్ల రాజేశ్వర్, మాజీ సర్పంచ్ నరసింహ చారి, నీలం రవి, వెల్మర్తి కిషన్, గోలి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: వేల్పూర్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ మహిళా శాసనసభ్యులు సబితా ఇంద్రారెడ్డి, సునీత లక్ష్మారెడ్డిలపైన ముఖ్యమంత్రి చేసిన నీచమైన వ్యాఖ్యలకు నిరసనగా సీఎం దిష్టిబొమ్మను గురువారం దగ్ధం చేశారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపులో భాగంగా రాష్ట్ర మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఆదేశాల మేరకు బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు నాగాధర్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాగాధర్ మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతిలో ఆడబిడ్డలకు ప్రత్యేక గౌరవ స్థానం ఉందన్న కనీస స్థాయి లేకుండా ఆడబిడ్డలను నమ్ముకుంటే ఆగమైతావంటూ, ముంచుతారంటూ.. జీవితం బస్టాండ్ పాలవుతుందంటూ ముఖ్యమంత్రి అసెంబ్లీ సాక్షిగా తన స్థాయి మరిచి చేసిన నీచమైన వ్యాఖ్యలను ప్రతి ఒక్కరూ ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. తక్షణమే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సాక్షి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు మహిపాల్, మోహన్, నోముల రవీందర్, మోతే రాజేశ్వర్, ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సింగల్ విండో చైర్మన్‌లు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ : బీఆర్ఎస్ పట్టణ శాఖ అధ్యక్షులు పూజ నరేందర్ ఆధ్వర్యంలో సీఎం దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. అసంబ్లీలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రరెడ్డిపై సీఎం అనుచిత వాఖ్యలు చేసినందుకు నిరసనగా పట్టణంలోని పెర్కిట్ చౌరస్తాలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు పూజ నరేందర్ మాట్లాడుతూ.. అసెంబ్లీ సాక్షిగా మహిళల పట్ల అనుచిత వాక్యాలు చేసినందుకు బెశారాతూగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ఈ గంగాధర్, మాజీ పిఎసిఎస్ చైర్మన్ నచ్చు చిన్నరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల యువజన అధ్యక్షులు అగ్గు క్రాంతి, సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


కమ్మర్‌పల్లి: దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


భీంగల్‌లో..

మహిళా హక్కులకోసం పోరాడుదాం

- పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షులు ఆకుల అరుణ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

దేశంలో మహిళలకు జరుగుతున్న అన్యాయాలపై ఉద్యమిస్తూ హక్కుల సాధనకై పోరాడుదామని జిల్లా అధ్యక్షురాలు ఆకుల అరుణ మహిళలకు పిలుపునిచ్చారు. ప్రగతిశీల మహిళా సంఘం ఆర్మూర్ డివిజన్ మహాసభ జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో ఆగస్టు 1న 2024న వి.పద్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభలో ముఖ్య అతిథిగా అరుణ పాల్గొని మాట్లాడుతూ.. "మాతృదేవోభవ" అంటూనే మహిళలపై వివక్షత జరుగుతుందని, వివిధ మతాల పేరుతో, కట్టుబాట్ల పేరుతో మహిళలను వంటింటికే పరిమితం చేస్తున్నారని ఆమె అన్నారు. స్వాతంత్ర్య భారతావనిలో మహిళలు రెండవ శ్రేణి పౌరులుగా చూడబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంటులో 33 శాతం రిజర్వేషన్ అమలుకు నోచుకోకపోవడం విచారకరమని ఆమె అన్నారు.

'బేటి బచావో బేటి పడావో' నరేంద్ర మోడీ నినాదం నీళ్ల మూటగా మారిందని ఆమె తెలిపారు. దేశంలో మహిళలపై అత్యాచారాలు, వరకట్న హత్యలు, లైంగిక వేధింపులు జరుగుతున్న మోడీ సర్కార్ నిర్లక్ష్యం చేస్తుందని ఆమె అన్నారు. సాక్షాత్తు బిజెపి పార్లమెంటు సభ్యుడు బ్రిజ్‌భూషన్ సింగ్ మహిళా మల్లయోధులను వేధించాడని,

దేశ రాజధాని ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేసిన నరేంద్ర మోడీ స్పందించకపోవడం శోచనీయమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. జనాభాలో సగం ఉన్న మనం అన్ని రంగాల్లో ఎదగాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. మహిళలకు ఉపాధి భద్రత, కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. ఘర్షణ లేకుండా చరిత్రలో మార్పు లేదని, అందుకే మనకు జరుగుతున్న అన్యాయంపై ఐక్యంగా పోరాడి, హక్కులను సాధించుకుందామని అరుణ పిలుపునిచ్చారు. ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసు మాట్లాడుతూ..ఒక్క కుటుంబంలో స్త్రీ విద్యావంతురాలయితే ఆ కుటుంబం బాలికలకు విద్య, ఉద్యోగానికి ప్రోత్సహిస్తారని ఆయన అన్నారు. పాలకులు ప్రజలను తరతరాలుగా శ్రమ దోపిడీ చేస్తున్న వారికి అండగా ఉండి, ప్రజల్ని కర్మ, దైవ సిద్ధాంతం పేరుతో పోరాడకుండా కుట్ర చేస్తున్నారని ఆయన అన్నారు. పుక్కిటి పురాణాల పేరుతో మహిళల మేధస్సును మార్చే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ఈ పెట్టుబడిదారీ వ్యవస్థలో మహిళలను సరుకుగా మార్చి, అశ్లీల సాహిత్యం, బూతు సినిమాల పేరుతో మహిళలపై దౌర్జన్యాలు జరుగుతున్న ప్రభుత్వాలు స్పందించి, నియంత్రించక పోవడం దుర్మార్గమని ఆయన అభిప్రాయపడ్డారు. బుక్కెడు బువ్వ కోసం అక్కలు,చెల్లెళ్లు మాణాలు అమ్ముకుంటున్నారని,

ప్రాణాలు తీసుకుంటున్న పట్టించుకోని పాలకుల దుర్నీతి ని ఎండగట్టాలని అన్నారు. ఝాన్సీ లక్ష్మీబాయి, చాకలి ఐలమ్మ, సుశేణా, చింతా లక్ష్మి అమరత్వ స్ఫూర్తితో ఉద్యమించాలని దాసు మహిళలకు సూచించారు. మా ఐఎఫ్‌టియూ అన్నివేళలా అండగా ఉంటుందని తెలిపారు. ఈ మహాసభలు ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సూర్య శివాజీ, అరుణోదయ జిల్లా అధ్యక్షులు వి సురేష్ బాబు, పి డి యస్ యు. ఆర్మూరు డివిజన్ అధ్యక్షులు ప్రిన్స్, పిఓడబ్ల్యు జిల్లా మహిళా సంఘం నాయకులు భారతి, ధనలక్ష్మి, మహమ్మదక్క, ఎం.లక్ష్మి దివ్య, ఆర్.అనిత, గునావా, వెంకవ్వ, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీఓడబ్ల్యూ నాయకులు

ఎమ్మార్వోను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-ఏర్గట్ల

ఏర్గట్లకు నూతనంగా వచ్చిన ఎమ్మార్వో శ్రీలతను మండల కాంగ్రెస్ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రేండ్ల రమేష్, మైనార్టీ మండల అధ్యక్షులు మునీరోద్దీన్, నాయకులు తుపాకుల శ్రీనివాస్, రొక్కెడ సంజీవ్,ఎండి.అన్వర్ పాల్గొన్నారు.

4,5న రాజకీయ శిక్షణ తరగతులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ నగరంలోని కొత్తగంజ్ మర్చంట్ అసోసియేషన్ హాల్లో 2 రోజులపాటు నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల రాజకీయ శిక్షణ తరగతులు ఉంటాయని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ తెలిపారు.

గురువారం సిపిఐ జిల్లా కార్యాలయంలో కంజర భూమయ్య, జిల్లా నాయకులు వై.ఓమయ్యలతో కలిసి ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈక్లాసులకు ఉమ్మడి జిల్లాలోని సిపిఐ జిల్లా కౌన్సిల్, ప్రజాసంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు పి.నర్సింగరావు, హనుమాన్లు, అనిల్, శ్రీనివాస్, భాగ్యలక్ష్మి, స్వరూప పాల్గొన్నారు

ఎల్ఓసి అందజేత

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని గోవింద్ పేట్ గ్రామానికి చెందిన అరుణ్ కుమార్ అనే వ్యక్తి గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. స్థానిక కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినయ్‌రెడ్డి కృషితో గురువారం ఎల్ఓసి అందజేశారు. గ్రామ మాజీ సర్పంచ్ మూగ ప్రభాకర్ చికిత్సకోసం సంప్రదించడంతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి రెండు లక్షల 50 వేల రూపాయలు వైద్య ఖర్చుల నిమిత్తం ఎల్ఓసి అందించారు. చికిత్సకు కావాల్సిన ఏర్పాట్లు స్థానిక నిమ్స్ వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించేలా చూడాలని వైద్యులను కోరారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రత్యేక చొరవ చూపినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు..

ఎస్సి వర్గీకరణపై హర్షం


నవతెలంగాణ-ముప్కాల్

ఎస్సి వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన వేళ గురువారం మండల ఎస్సి వర్గీయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్సి సెల్ మండల అధ్యక్షుడు టి.సాయన్న మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్ళ పోరాటానికి న్యాయం జరిగిందని అన్నారు. ఎస్సి వర్గీకరణ చేసే అధికారం రాష్ట్రాలకు ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసినట్లు తెలిపారు. విద్య, ఉద్యోగాల్లో, ఎస్సి,ఎస్టీల రిజర్వేషన్ల కోసం వర్గీకరణ జరుగుతుందని గుర్తుచేశారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతించారు. కార్యక్రమంలో ఎస్సి,ఎస్టీ నాయకులు టీ.సాయన్న, గద్దల గంగారాం, గద్దల సాయిలు, గైని సాయన్న, నేర బాబూరావు, గద్దల గంగాధర్, రాజు, అనిల్, నరేష్ తదితరులు పాల్గొన్నారు..

ప్రధానోపాధ్యాయుడికి సన్మానం

నవతెలంగాణ - నిజామాబాద్ రూరల్

ప్రభుత్వ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడైన రాజేందర్‌ను ఉపాధ్యాయుల సంఘం తరపున ఘనంగా సన్మానించారు. ఉద్యోగ విరమణ కార్యక్రమానికి విచ్చేసిన ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష కార్యదర్శులు సీఎం సాయరెడ్డి, పి గంగాధర్, కోశాధికారి రమేష్ రెడ్డి, సీనియర్ ప్రధానోపాధ్యాయులు వెంకట్ నారాయణ గౌడ్ పలువురు రాజేందర్‌కు కృతజ్ఞతాభిమందనాలు తెలిపి జిటిఏ తరపున సన్మానించారు. కార్యక్రమంలో జిటిఏ రాష్ట్ర అధ్యక్షులు కాసం ప్రభాకర్, ముఖ్య అతిథిగా పాల్గొని సన్మాన కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు జిటిఏ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు


హెచ్ఎంను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును ఖండిస్తున్నాం

- మాల మహానాడు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఎస్సీ వర్గీకరణ పై సుప్రీంకోర్టు గురువారం వెలువరించిన తీర్పును తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు జిల్లా మాల మహానాడు జనరల్ సెక్రెటరీ నాయుడు రాజు ఖండించారు. గురువారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో పార్లమెంటు ఎన్నికల్లో మందకృష్ణ మాదిగ, ప్రధాని నరేంద్ర మోడీ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుల మధ్య ఉన్న లోపాయికారి ఒప్పందం ద్వారానే నేడు సుప్రీంకోర్టులో మాలలకు అన్యాయం జరిగేలా తీర్పు వెలువడిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు నిర్ణయాన్ని తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. తమ అధ్యక్షులు చెన్నయ్య ఆదేశాల మేరకు మాలలంతా ఏకమై పెద్ద ఎత్తున ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఇప్పటికైనా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పున పరిశీలన చేయాలని, రిజర్వేషన్లు పెంచి తమకు తమిళనాడు తరహాలో దళిత బహుజనులకు సుప్రీంకోర్టు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో భవిష్యత్తులో ప్రధాని మోడీకి మాలలంతా బుద్ధి చెబుతామన్నారు.

మాలలు ఆందోళన చెందకండి

- మాలమహానాడు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

మాలలందరూ ఆవేశాలకు గురికాకుండా, ఆందోళన చెందకుండా ఉండాలని మాలమహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎడ్ల నాగరాజు అన్నారు. నగరంలోని ఓ ప్రైవేటు కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఎస్సి, ఎస్టీ వర్గీకరణ అంశంపైన సుప్రీంకోర్టు గురువారం ఇచ్చిన తీర్పుపట్ల ఆందోళనలు అవసరం లేదని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణ చేసుకోవచ్చని సుప్రీంకోర్టు తీర్పును ఇచ్చిందని తెలిపారు. గతంలో 5 నవంబర్ 2004లో ఇచ్చిన తీర్పును కూడా మాలమహానాడు గౌరవిస్తుందని మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర కమిటీ అధ్యక్షులు పూర్వ ప్రభుత్వ న్యాయవాది తల్లమల్ల హసేన్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎడ్ల నాగరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిడ్ల పరంజ్యోతి రావు అన్నారు. మాలలందరూ ఆవేశాలకు గురికాకుండా, ఎలాంటి నిరసనలు, ఆందోళనలు చేయకుండా ఉండాలని కోరారు. ఇచ్చిన తీర్పుపైన సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేయుటకు అవకాశం ఉందని అన్నారు. 9 మంది లేదా 11 మంది న్యాయమూర్తుల ఫుల్ బెంచ్ పంపాలని సుప్రీం కోర్టుకు పోయే అవకాశం గురించి నిష్ణాతులైన న్యాయవాదులతో మాట్లాడే అవకాశం గురించి ఆలోచించే సమయం ఉన్నదని తెలిపారు. ఆందోళనలు చేయవసిన అవసరం లేదుని, తొందరపడకుండా ఓపికతో ఉండాలని కోరారు.

పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు సన్మానం



నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని కేమ్రాజ్‌కల్లాలీ ఎంపీయూపీఎస్ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న పలువురు ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే పదోన్నతులు, బదిలీలు చేసింది. అందులో భాగంగా కేమ్రాజ్‌కల్లాలీ ఎంపీయూపీఎస్ ఉపాధ్యాయులు వేరే మండలాలలకు, ఇంకొంత మందికి జుక్కల్ మండలంలోనే ఇతర పాఠశాలలకు బదిలీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యా కమిటీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులందరికీ, గ్రామపెద్దలతో కలిసి సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కొన్నేండ్లుగా పాఠశాల విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషిచేసిన హెచ్ఎం జయచంద్, ఉపాధ్యాయులు సంతోష్, సంజీవ్, శాలువాకప్పి పుష్పగుచ్చాలు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు శంకర్, రమేష్‌రావ్ దేశాయి, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

బస్సు సమయం మార్చాలి

- డిపో ఎదుట విద్యార్థుల నిరసన

నవతెలంగాణ-బోధన్

సాలూర నుంచి బోధన్‌కు వచ్చే బస్సు సమయాన్ని విద్యార్థుల సమయానికి అనుకూలంగా మార్చాలని కోరుతూ బీవీఎస్ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులు బోధన్ డిపో ఎదుట గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం నాయకులు లింగం మాట్లాడుతూ.. విద్యార్థుల సమయం ప్రకారం బస్సును నడిపించాలని అన్నారు. గతంలో సాలూర మండల కేంద్రంలో విద్యార్థులతో నిరసన చేపట్టామని, ఆనాడు ఆర్టీసీ అధికారులు సానుకూలంగా స్పందించి బస్సు సమయం మారుస్తామని చెప్పి, ఇంతవరకు సమస్య పరిష్కారం కాలేదన్నారు. అదే పాత సమయం ఉదయం 7 గంటలకు బస్సు నడిపిస్తున్నారని వివరించారు. విద్యార్థుల సమస్యపై స్పందించిన డీఎం శ్రీనివాస్ ఇప్పటినుంచి బస్సు సమయం సరిచేసి విద్యార్థులకు అనుకూలంగా ఉండేలా బస్సులు వేస్తానని హామీ ఇచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో బివిఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్

నవతెలంగాణ-నిజాంసాగర్

మండల కేంద్రంలోని వివిధ శాఖల అధికారుల పనితీరును కామారెడ్డి జిల్లా కలెక్టర్ అశ్విన్ సాంగ్వన్ ఆకస్మికంగా గురువారం తనిఖీ చేపట్టారు. ముందుగా నిజాంసాగర్ మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆసుపత్రిలో హాజరు పట్టికను తనిఖీ చేసి జూలై 27 నుంచి ఇప్పటివరకు విధులకు హాజరు కానటువంటి జూనియర్ అసిస్టెంట్ సుభాష్‌ను సస్పెండ్‌కు ఆదేశించారు. అలాగే రెగ్యులర్‌గా విధులకు హాజరుకానీ ల్యాబ్ టెక్నీషియన్ నవ్యశ్రీని సంజాయిషీ కోరారు. ఆస్పత్రిలోని ఇన్‌పేషెంట్ వార్డును పరిశీలించి రోగులతో మాట్లాడి ఆసుపత్రిలో అందుతున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. అందుబాటులో ఉన్న మందుల వివరాల గూర్చి వైద్యాధికారి డాక్టర్ రోహిత్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల మరమ్మతు పనులను కలెక్టర్ పరిశీలించారు. 4లక్షల 82వేల రూపాయలతో చేపట్టిన నిర్మాణ పనులు పూర్తయిన స్లాబు మరమ్మతులు, తాగునీటి వసతి, మరుగుదొడ్ల పనులు పరిశీలించారు. మధ్యాహ్న భోజనం వండే విధానాన్ని చూశారు. మెనూ ప్రకారం రుచికరమైన, నాణ్యమైన వంటలు ఉండాలని ఏజెన్సీ ప్రతినిధులకు సూచించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించి పాఠశాలలో గల విద్యార్థులు అందరూ రెగ్యులర్‌గా పాఠశాలకు వచ్చేలా చూడాలని ఎంఈఓ దేవిసింగ్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా 9వ తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో ముచ్చటించి రోజు బడికి వచ్చి మంచిగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. తరగతిలో పెద్దగా ఉన్న విద్యార్థులకు యూనిఫామ్ చిన్నగా ఉండడంతో పెద్ద సైజులో యూనిఫాంలను కుట్టించాలని ఐకెపి ఎపిఎంను ఆదేశించారు. పాఠశాల పరిసరాల్లో పెరిగిన పిచ్చి మొక్కలు తొలగించి పరిసరాలు పరిశుభ్రంగా మార్చాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కేంద్రాన్ని సందర్శించి ప్రభుత్వ పథకాలకు సంబంధించి వివిధ కారణాలతో లబ్ది కానీ ప్రజల నుంచి దరఖాస్తుల పరిశీలన, డిస్పోజల్‌ను పరిశీలించి ప్రజాపాలన కేంద్రాల ద్వారా స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి వేగంగా ప్రజలకు లబ్ది చేకూర్చాలని ఎంపీడీవో గంగాధర్‌ను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆదేశించారు. ఎంపీడీవో, ఎంపీఓ, ఈజీఎస్ అధికారుల హాజరు పట్టికను పరిశీలించి 100 శాతానికి మించి ఉపాధి హామీ జాబ్ కార్డుదారులకు ఉపాధి కల్పించాలని ఆదేశించారు. అనంతరం మండలంలోని గోర్గాల్ గ్రామ పరిధిలో గల అటవీ ప్రాంతంలో అటవీ శాఖ అధికారులు ఏర్పాటు చేసిన వన మహోత్సవం కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. మొక్కలను పశువులు తినకుండా రక్షణ కవచాలు ఏర్పాటు చేయాలని అటవీశాఖ, ఈజీఎస్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కొందరు గ్రామస్తులు అటవీ భూమి కబ్జాకు గురి అవుతుందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దానితోపాటు మండలంలోని పలు గ్రామాలలో చెరువుల భూమి కూడా కబ్జాకు గురవుతున్నాయని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని పలు గ్రామంలోని ప్రజలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

స్పందించిన కలెక్టర్ వెంటనే చెరువుల సర్వే చేయాలని మండల రెవెన్యూ అధికారి బిక్షపతిని ఆదేశించారు. చెరువులను ఎవరైనా కబ్జా చేస్తే వెంటనే ప్రభుత్వం ఆక్రమించాలని ఆయన మండల రెవెన్యూ అధికారిని, బాన్సువాడ రెవెన్యూ డివిజనల్ అధికారి రమేష్ రాథోడ్‌ను ఆదేశించారు. అనంతరం మండలంలోని వడ్డేపల్లి గ్రామ శివారులోని పత్తి చేనులో వ్యవసాయ శాఖ అధికారులు చేస్తున్న పంటల వివరాల నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. అన్ని పంటలను సర్వే నెంబర్ల వారీగా కచ్చితంగా నమోదు చేయాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. రైతు రుణమాఫీ జరిగిందా అని రైతును అడిగి తెలుసుకున్నారు. ఏదేని కారణాలతో రుణమాఫీ జరగని రైతులకు త్వరగా రుణమాఫీ జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ భాగ్యలక్ష్మిని ఆదేశించారు. అనంతరం నిజాంసాగర్ ప్రాజెక్టును పరిశీలించి 100 సంవత్సరాలు క్రితం నిర్మించిన ప్రాజెక్ట్ గురించి ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సోలేమన్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్ట్ కింద ఒక లక్ష 15 వేల ఎకరాల ఆయకట్టు వరకు నీరు అందుతున్నాయని ఆయన కలెక్టర్‌కు తెలిపారు. ప్రాజెక్ట్‌కు గేట్లు ఇప్పటికీ మాన్యువల్‌గానే ఓపెన్ చేయడం జరుగుతుందని ఇరిగేషన్ అధికారి వివరించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ నుండి నీటిని వదిలేటప్పుడు డ్యామ్ కింది ప్రాంత ప్రజలకు అప్రమత్తం చేయాలని ఇరిగేషన్ అధికారి సోలేమన్‌ను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పుట్టిన బిడ్డకు తల్లిపాలే శ్రేయస్కరం

- దుబ్బతండా అంగన్వాడీ ఉపాధ్యాయురాలు శారద

నవతెలంగాణ-ఎడపల్లి

పుట్టిన బిడ్డకు తల్లిపాలే శ్రేయస్కరమని అంగన్వాడీ టీచర్ శారద అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని దుబ్బతండా గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో, ఉపాధ్యాయురాలు శారద తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి సాయికుమార్, ఆశావర్కర్ కవిత, ఎడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఏఎన్ఎం గంగామణి తదితరులు పాల్గొన్నారు.

కిసాన్ తండాలో నర్సరీ పరిశీలన

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కిసాన్‌తాండా గ్రామంలోని నర్సరీని ఎంపీడీవో వెంకటేష్ జాదవ్, పాలన అధికారి హెచ్.శ్రీనివాసులు గురువారం పరిశీలించారు. నర్సరీలో పెంచిన మొక్కలను ప్రతి కుటుంబానికి పంపిణీ చేసి తమ ఇంటి ముందర ఖాళీ స్థలాల్లో నాటుకునేలా చర్యలు తీసుకోవాలని గ్రామ కార్యదర్శి సాయిబాబాను ఆదేశించారు.

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌కు ఘనంగా వీడ్కోలు

నవతెలంగాణ-బిచ్కుంద

ప్రభుత్వం ఇటీవల చేపట్టిన ప్రభుత్వ ఉద్యోగుల బదిలీల్లో బిచ్కుంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్రముఖర్జీ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ చంద్రశేఖర్ బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు, సిబ్బంది వారిని ఘనంగా సత్కరించారు. అధ్యాపకులు మాట్లాడుతూ.. ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో డిగ్రీ కళాశాలను న్యాక్ సీ గ్రేడ్ నుంచి న్యాక్ ఏగ్రేడ్ తీసుకురావడానికి కళాశాలకు అటానమస్, పిజి కోర్సులు సాధించడం వెనుక ప్రిన్సిపాల్ కృషి ఎంతో ఉందన్నారు. కళాశాల స్థాయిని జిల్లా వ్యాప్తంగానే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు సాధించడం వెనుక ఎంతో కృషి చేశారని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ బదిలీ కావడంతో ఇంచార్జ్ ప్రిన్సిపాల్‌గా అశోక్‌కు బాధ్యతలు అప్పగించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం ఉన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అమ్మఒడి

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అమ్మ ఒడి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు, మహిళలకు చికిత్సలను నిర్వహించినట్లు ఆరోగ్య విస్తీర్ణ అధికారి శ్రావణ్‌కుమార్, పిహెచ్ఎన్ రాణి పేర్కొన్నారు. ప్రతి గురువారం అమ్మఒడి కార్యక్రమంలో భాగంగా మహిళలకు రక్తహీనత, బిపి, షుగర్ లాంటి వ్యాధులకు చికిత్సలు చేసి వారికి తగిన మందులను ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు జానకి, రాజ్యలక్ష్మి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఆర్థిక సాయం

నవతెలంగాణ-పోతంగల్

మండలంలో గత కొద్దిరోజుల నుంచి కురుస్తున్న వర్షానికి జల్లపల్లి, ఆబాది గ్రామంలో ఇద్దరి నివాసపు ఇల్లు కూలిపోయాయి. సామాజిక కార్యకర్త ఎంఎ హకీమ్ బాధితుల వద్దకు వెళ్లి.. ఇద్దరికీ రూ.3000 నగదు ఆర్థిక సాయం గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దీనితో పాటు మిగతా వారి పేర్లను నమోదు చేసుకొని వారికి సైతం ఆర్థిక సాయం చేస్తానని తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వం ద్వారా సాయం అందించేలా చూస్తామని అన్నారు. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్‌పర్సన్ కాసుల బాలరాజు ప్రభుత్వం తరఫున నిరుపేదలకు సుమారు 50 నుంచి 60 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందేలా చూడాలని కోరారు. ఆయనతోపాటు ఆబాది మాజీసర్పంచ్ వివేక్, విలేజ్ ప్రెసిడెంట్ ధనరాజ్, హకీం భాయ్, కాంగ్రెస్ నాయకులున్నారు.

కృతజ్ఞత సభకు అందరూ రావాలి

నవతెలంగాణ-కామారెడ్డి

హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించే ముఖ్యమంత్రి కృతజ్ఞత సభకు కామారెడ్డి జిల్లా నుంచి వ్యాయామ ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొనాలని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత 15 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న పండిత్, పీఈటిల అప్రిడేషన్‌ను సీఎం చొరవతో సుప్రీంకోర్టులో ఉన్న కేసును కొట్టేయించి ప్రమోషన్‌లు కల్పించినందుకు కృతజ్ఞతా సభను శుక్రవారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించనునట్టు తెలిపారు.

మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ సి.శోభరాణి

నవతెలంగాణ-సదాశివనగర్

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల కామారెడ్డి (మర్కల్)నందు డాక్టర్ సి.శోభారాణి నూతన ప్రిన్సిపాల్‌గా ప్రమోషన్ పొంది బాధ్యతలు చేపట్టారు. అధ్యాపకులందకరూ సాదరంగా ఆహ్వానం పలికి సన్మానించారు. అలాగే కళాశాల నుంచి ఇతర కళాశాలలకు బదిలీపై వెళ్తున్న 16 మంది అధ్యాపకులను కూడా ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆర్.ఉదయిని, అకాడమిక్ కోఆర్డినేటర్ కె.వనజ, అధ్యాపకులు శ్రీలత, డాక్టర్ ఉజ్మాసుల్తానా, డాక్టర్. శ్రావణి, మీనా తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు తాగునీటి ట్యాంక్ వితరణ

నవతెలంగాణ-బోధన్

మండలంలోని అమ్దాపూర్ గ్రామంలోని జడ్పి హైస్కూల్‌కు గురువారం విద్యార్థుల సౌకర్యార్థం ఐలవ్ మై విలేజ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రూ.20వేల విలువ గల 15000 లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంక్‌ను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సూర్యకుమార్ మాట్లాడుతూ.. విద్యార్థుల తాగునీటి సమస్య పరిష్కారానికి కృషిచేసిన ఐలవ్‌మై విలేజ్ సంస్థకు స్కూల్ ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల తరుపున ధన్యవాదాలు తెలిపారు. ఎంఈఓ నాగనాథ్, ఐలవ్‌మై విలేజ్ కో ఆర్డినేటర్స్ ఎస్.ప్రభావతి, కాంత, మంజుల, పాఠశాల సిబ్బంది, సిఆర్పీ విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఇసుక వేలం

నవతెలంగాణ-పొతంగల్

మండలంలోని హంగర్గ గ్రామంలో స్వాధీనం చేసుకున్న దాదాపు 14 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుకను శుక్రవారం ఉదయం 11:30 గంటలకు తహసీల్దార్ కార్యాలయంలో వేలం వేయనున్నట్టు తహసీల్దార్ జె.మల్లయ్య తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు రూ.5000 డిపాజిట్ చేసి వేలంలో పాల్గొనవచ్చునని పేర్కొన్నారు.

పొల్కంపేట్‌లో వన మహోత్సవం

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని పొల్కంపేట్ గ్రామంలో గురువారం వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటినట్టు పంచాయతీ కార్యదర్శి అశ్వక్ తెలిపారు. వన మహోత్సవాల్లో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. వనమహోత్సవంలో భాగంగా 200 మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ ఉపసర్పంచ్ రామానుజచారి, క్షేత్ర సహాయకులు వెంకటేశం గ్రామస్తులు ఉపాధి కూలీలు ఉన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేష్ఠమైనవి

నవతెలంగాణ-జుక్కల్

తల్లిపాలు బిడ్డకు శ్రేష్ఠమైనవని కేమ్రాజ్‌కల్లాలీ తాండా అంగన్వాడీ టీచర్ రాదా అన్నారు. గురువారం అంగన్వాడీ కేంద్రంలో బాలింతలకు, గర్భిణులకు తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాధా మాట్లాడుతూ.. అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లి ముర్రుపాలు అందించాలని, ఆ పాలలో బిడ్డకు రోగనిరోధక శక్తి పెంచుతుందని తెలిపారు. ప్రతి ఒక్క బాలింతలు బలవర్ధకమైన ఆహారం పాలు, గుడ్లు, తాజా కూరగాయలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పీఆర్‌డీఈ, ఏఈలకు సన్మానం

నవతెలంగాణ-జుక్కల్

మండలంలో పంచాయత్‌రాజ్ శాఖలో ఏఈగా శ్రీనివాస్‌రెడ్డి చాలా రోజులుగా బాధ్యతలు నిర్వర్తించి బదిలీపై వెళ్తున్న క్రమంలో.. కొత్తగా వచ్చిన డీఈగా గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన వారికి మండలంలోని ప్రజాప్రతినిధులు సాంప్రదాయం ప్రకారం గాంధీ టోపీ పెట్టి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు రాజశేఖర్ పటేల్, రవిపటేల్, శివాజీ పటేల్, కపిల్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన చైర్‌పర్సన్

నవతెలంగాణ-కామారెడ్డి

అడ్లూరు 2వ వార్డులోని వనమహోత్సవం కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ పాల్గొని మొక్కలు నాటారు. గురువారం అడ్లూరు 2వ వార్డులో పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాలలో చెరువు గట్లపైన, కాల్వ గట్లపైన వీరివిగా మొక్కలు పెంచి చెట్లను పరిరక్షించుకుందామన్నారు. పట్టణ ప్రజలందరూ ఒక్కొక్కరూ ఒక మొక్క నాటాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, వార్డ్ కౌన్సిలర్ సుతారి రవి, అన్వర్ హైమద్, తాయాబ సుల్తానా సలీం, పాత శివ కృష్ణమూర్తి, పిడుగు మమతా సాయిబాబా, రూప, తదితరులు పాల్గొన్నారు.

అన్న బహుసాటే జయంతి

నవతెలంగాణ-మద్నూర్

మండలంలోని పెద్దతడుగూర్ గ్రామంలో సాహితీ రత్న డాక్టర్ అన్నా బహుసాటే 104వ జయంతి వేడుకలను ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రముఖులు మాట్లాడుతూ.. సాహితీ రత్న డాక్టర్ అన్న బహుసాటే మార్గంలో ఆయన ఆశయాలకు అనుగుణంగా నేటి సమాజం యువకులంతా ఆయన అడుగుజాడల్లో నడుచుకోవాలని తెలిపారు. ఉత్సవ కమిటీ నాయకులు బలరాం, యాదవ్‌రావు, వినోద్ సంజు, లక్ష్మణ్, టోపాజి గంగారాం, పండరి ప్రభు రమేష్, సాయిలు, తదితరులు పాల్గొన్నారు

జన్మించగానే శిశువుకు ముర్రుపాలు ఇవ్వాలి

నవతెలంగాణ-కామారెడ్డి

శిశువు జన్మించగానే గంటలోపు ముర్రుపాలు ఇవ్వాలని అది ఎంతో శ్రేష్టమైనవని అంగన్వాడీ ఉపాధ్యాయురాలు కల్పన అన్నారు. గురువారం కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని లింగాపూర్ గ్రామంలో అంగన్వాడీ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు.

సుప్రీంకోర్టు తీర్పు పట్ల సంబురాలు



కామారెడ్డి : అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నవతెలంగాణ-విలేకరుల బృందం

కామారెడ్డి : ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు స్వాగతిస్తూ జిల్లా కేంద్రంలో దళిత నాయకులు స్వీట్లు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. మాదిగ రాజకీయ పోరాట సమితి జిల్లా అధ్యక్షులు చిట్యాల సాయన్న ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు చిట్యాల సాయన్న, రాష్ట్ర ఉపాధ్యక్షులు భాగయ్య మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా ఉద్యమ ఫలితంగానే, వేలాదిమంది మాదిగ, మాదిగ ఉపకులాల ఉద్యమకారులు చనిపోయారని తెలిపారు. దీనిపై స్పందిస్తూ నిండు అసెంబ్లీ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి ఈ తీర్పును తాము స్వాగతిస్తూ మాదిగ, మాదిగ ఉపకులాలకు విద్యారంగంలో, ఉద్యోగ రంగంలో ఉద్యోగాలు కల్పిస్తామని తెలిపారని వివరించారు. ఆ మాటను నిలబెట్టుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి మాటను నిలబెట్టుకోవాలని వెంటనే దీనిని అమలు చేయాలని అన్నారు. అశోక్, గంగాధర్, శివరాజు చింటూ, చింటూ, బాలయ్య, హైమద్, రాజలింగం పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పు పట్ల హర్షం : గడ్డం సంపత్

ఎన్నో ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ కోసం జరుగుతున్న ఉద్యమానికి దేశ అత్యున్నత న్యాయస్థానం సానుకూల తీర్పు ఇవ్వడం ఎంతో హర్షించదగ్గ విషయమని మాదిగ విద్యార్థి ఉద్యమ నాయకుడు గడ్డం సంపత్ అన్నారు. సామాజిక అణచివేతకు గురవుతున్న ఎస్సీల్లో ఉన్న వారందరికీ ఎటువంటి అసమానతలు లేకుండా చూడాలని విద్య, ఉద్యోగ రంగాల్లో అవకాశం కల్పించాలని కోరుతూ జరిగిన ఉద్యమానికి చారిత్రక తీర్పు వెలువడటం ఆనందంగా ఉందన్నారు. ఎస్సీ వర్గీకరణ వల్ల మాదిగ, మాదిగ ఉపకులాలకు ఎవరి వాటా వారికి దక్కుతుందన్నారు.

మాదిగ జాతి చిరకాల ఆకాంక్ష నెరవేరింది..

రెంజల్ : ఎస్సీ వర్గీకరణ పోరులో అంతిమ విజయం ధర్మమే గెలిచిందని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీగారి భూమయ్య స్పష్టం చేశారు. గురువారం మండల కేంద్రంలో స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు తామంతా స్వాగతిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏళ్ల తమ పోరాటం నేటితో ఫలించిందని వారు ఆనందం వ్యక్తం చేశారు. ఈ విజయానికి ప్రధాన కారకుడు ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగనేనని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు మారుతి, జిల్లా సహాయ కార్యదర్శి బండారి పోశెట్టి, మాదిగ మహిళా సంఘం జిల్లా నాయకురాలు పద్మ, స్వప్న, బోధ నియోజకవర్గం నాయకులు బి.శంకర్, రెంజల్ మండల నాయకులు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు స్వాగతిస్తున్నాం : జిల్లా సెక్రెటరీ శెట్టిపల్లి విష్ణు

బిచ్కుంద : ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుని స్వాగతిస్తున్నట్టు బీజేవైఎం కామారెడ్డి జిల్లా సెక్రెటరీ శెట్టిపల్లి విష్ణు అన్నారు. ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ఎన్నో ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ కోసం పోరాడుతున్న మందకృష్ణ మాదిగ కృషి ఫలించిందని అణగారిన వర్గాల దశాబ్దాల పోరాటానికి న్యాయం జరిగిందని అలుపెరుగని పోరాట యోధుడు మందకృష్ణ మాదిగ 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటానికి ఫలితం లభించిందన్నారు. శాసనసభ ఎన్నికల సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన బహిరంగ సభలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ మందకృష్ణ మాదిగను తన సోదరుడు అంటూ ఆలింగనం చేసుకొని ఎన్నో ఏళ్లుగా పోరాటం చేస్తున్న నీ శ్రమ త్వరలోనే ఫలిస్తుందని ఎస్సీ వర్గీకరణ చేసి తీరుతామని మాట ఇచ్చారని ఈ సందర్భంగా గుర్తుచేశారు.

మాదిగల పక్షపాతి సీఎం: ఎమ్మెల్యే..

మద్నూర్ :

మాదిగల పక్షపాతి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని ఎస్సీ వర్గీకరణ అంశంలో రాష్ట్రాలకు అధికారం ఇస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తూ రాష్ట్ర అసెంబ్లీలో జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మీకాంతరావు ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణలోని యావత్ మాదిగ సమాజానికి మాదిగ ఉప కులాలకు అసెంబ్లీ వేదికగా ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేశారు.

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే..

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో అసెంబ్లీలోని సీఎం ఛాంబర్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు, పలువురు ఎమ్మెల్యేలు స్వీట్లు తినిపించి కృతజ్ఞతలు తెలిపారు.

వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు పట్ల హర్షం..

బోధన్ : ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు పట్ల హర్షం వ్యక్తం చేస్తూ గురువారం బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ నాయకులు టపాసులు పేల్చి, స్వీట్లు పంచుతూ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్, దండోరా ఉద్యమ సీనియర్ నాయకులు లింబూరి లక్ష్మణ్ మాట్లాడుతూ.. అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని ప్రకటించడం, అలాగే బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు సైతం ఎస్సీ వర్గీకరణకు తాము అనుకూలమేనంటూ ప్రకటించడంపై తాము హర్షం వ్యక్తం చేస్తున్నట్టు తెలిపారు. గత 30 సంవత్సరాలుగా మాదిగ, మాదిగ ఉపకులాలకు వర్గీకరణ చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ నేతృత్వంలో ఎందరో నాయకులు ఉద్యమించారని వారందరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఉప్పల రామకృష్ణ, వీరపురం పోశెట్టి, బెల్లిడుగా సుధాకర్, మోచి శంకర్, కౌన్సిలర్ రాధాకృష్ణ, అద్దంకి హుస్సేన్, కల్ల మహేందర్, సందీప్, మోచిలింగయ్య బ్యాంక్ రాములు, నల్వాల విజయ్, సాయిలు, గజపాక సాగర్, జేపీసీ శంకర్, పెద్దింటి సురేష్, చిన్న సుధాకర్, పిట్ల అబ్బయ్య, పిట్ల మహేష్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మదన్‌మోహన్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-విలేకరుల బృందం

లింగంపేట్ : ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్మోహన్‌రావు జన్మదినాన్ని పురస్కరించుకొని మండలంలోని ఆయా గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లింగంపేట్ మండల అధ్యక్షులు బుర్ర నారాగౌడ్, మాజీ జెడ్పిటిసి ఏలేటి శ్రీలత సంతోష్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు ఎల్లమయ్య అశోక్, డాక్టర్ విట్టల్, సాయికుమార్, రవి, రాజు, ప్రసాద్‌గౌడ్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

త్రిలింగ రామేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు..

నాగిరెడ్డిపేట్ : మండలంలోని తాండూర్ గ్రామంలో గల త్రిలింగ రామేశ్వర ఆలయంలో తాండూరు సొసైటీ చైర్మన్ ఆకిడి గంగారెడ్డి ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్‌రావు పుట్టినరోజు సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ రాహుల్ మంత్రి పదవి రావాలని కోరుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు సంగయ్య ఉన్నారు.

చీనూర్ గ్రామంలో అన్నదానం..

మండలంలోని చీనూర్ గ్రామంలో గురువారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్‌రావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మురళి గౌడ్, వాసురెడ్డి, విఠల్‌రెడ్డి, నారాయణరెడ్డి కేక్ కట్ చేసి గ్రామస్తులకు తినిపించారు. అనంతరం గ్రామంలో పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్‌రావు పుట్టినరోజు సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పర్వతరావు, ఇమామ్, ఠాగూర్, గులాం హుసేన్, కిష్టయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వానికి మారుపేరు.. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే

సదాశివనగర్ : మానవత్వానికి మారుపేరు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు అని సదాశివనగర్ కాంగ్రెస్ మండల నాయకులు పేర్కొన్నారు. గురువారం ఎమ్మెల్యే జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలోని విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మెన్ మర్రి సదాశివరెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు ఇర్షాదుద్దిన్, తాజా మాజీ వైస్ యంపిపి శ్రీనివాసరెడ్డి, మాజీ వైస్ యంపిపి రుపేందర్ రెడ్డి, బత్తుల రామ్‌రెడ్డి, ఎర్రవాటి లింగారెడ్డి, పైడి సంతోష్ రెడ్డి, భాస్కర్, అశోక్, నితీన్‌గౌడ్ ఉన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

మద్నూర్ : ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ముఖ్య యువ నాయకులు సాయిపటేల్ ఎమ్మెల్యేకు స్వీట్లు తినిపిస్తూ ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.



గాంధారిలో..

ఘనంగా ఎమ్మెల్యే మదన్ మోహన్ జన్మదిన వేడుకలు..

గాంధారి : ఎల్లారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే మదన్ మోహన్ పుట్టినరోజు సందర్భంగా మండల కేంద్రంలోని బుడగ జంగాల కాలనీలో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. గాంధారి మాజీ ఎంపిటిసి సభ్యులు, సీనియర్ నాయకులు తూర్పు రాజులు, కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ ప్రజలందరికీ అన్నదాన కార్యక్రమం నిర్వహించి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు లైన్ రమేష్, సంగని బాలయ్య, గాండ్ల లక్ష్మణ్, ఆకుల లక్ష్మణ్, సంగని బాబా, ప్రవీణ్ గౌడ్, సుద్దాల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని రామలక్ష్మణ్‌పల్లి, జువ్వడి, తదితర గ్రామంలో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.

మహిళా ఎమ్మెల్యేలపై సీఎం అనుచిత వ్యాఖ్యలు : బీఆర్ఎస్

నవతెలంగాణ-సదాశివనగర్

అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహిళా ఎమ్మెల్యేలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం చూస్తే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మహిళల పట్ల ఎంత గౌరవం ఉందో అర్థమవుతుందని బీఆర్ఎస్ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బొలిపల్లి మహేందర్‌రెడ్డి మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి సాక్షాత్తు అసెంబ్లీలో తోటి శాసనసభ్యులు అందులో మహిళా సభ్యుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. సమావేశంలో సీనియర్ నాయకులు శ్రీనివాస్ నాయక్, రాజేశ్వరరావు, రచన, సాయగౌడ్, గైని రమేష్, మాజీ సర్పంచ్ గాదారి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ఉమర్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాలు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని బాగేపల్లి గ్రామంలో తల్లిపాల వారోత్సవాలలో భాగంగా ఎంపీడీవో వెంకటేష్, పాలన అధికారి హెచ్.శ్రీనివాస్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ప్రమీల రాణి గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పుట్టిన బిడ్డకు 6 నెలల వరకు తల్లిపాలు తాగిస్తే బిడ్డ ఆరోగ్యకరంగా ఉంటుందని వారు పేర్కొన్నారు. ఎక్కువగా ఆకుకూరలు తీసుకోవాలని సూచించారు. గ్రామ కార్యదర్శి జి.శ్రీకాంత్, అంగన్వాడీ కార్యకర్త సరోజ, ఆశావర్కర్‌లు, కారోబార్ మహేష్ పాల్గొన్నారు.

మాజీ వైస్ ఎంపిపిని పరామర్శించిన బాజిరెడ్డి


మాజీ ఎంపిపిని పరామర్శిస్తున్న బాజిరెడ్డి

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్
మల్లారం గ్రామంలో మాజీ వైస్ ఎంపీపీ అన్నం సాయిలును టీఎస్ఆర్టిసి మాజీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ గురువారం పరామర్శించారు. ఇటీవల ఎడమ కాలికి సర్జరీ అయినందున వారిని పరామర్శించి మనోధైర్యాన్ని ఇచ్చారని తెలిపారు. ఆయన వెంట మండల అధ్యక్షులు మీసాల మధుకర్ రావు, మండల సీనియర్ నాయకులు బానోత్ ప్రేమ్ నాయక్, గోపాల్ రెడ్డి, బాల్‌రాజ్, నగేష్, రామ్ గోపాల్‌రెడ్డి, గంగారాం నాయక్, బానోత్ గోపాల్‌నాయక్, వసంత్‌రావు నాయక్, సామ్యానాయక్, కోర్వ దేవేందర్, తిరుమల్, వినయ్, తదితరులు ఉన్నారు.

సీఎం దిష్టిబొమ్మ దహనం


సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-ఏర్గట్ల
మండలకేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద బీఆర్ఎస్ మండలాధ్యక్షులు పూర్ణానందం ఆధ్వర్యంలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ సాక్షిగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబిత ఇంద్రారెడ్డిని సీఎం రేవంత్ రెడ్డి అవమానించడం పట్ల ఆయన దిష్టిబొమ్మను దహనం చేశామని అన్నారు. ముఖ్యమంత్రి హుందాతనాన్ని కాపాడుకోవాలని, ప్రతిపక్షాలను గౌరవించకుంటే అంతం తప్పదని, సబితా ఇంద్రరెడ్డికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలని మండల బీఆర్ఎస్ పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

21వ ప్యాకేజీ పనులవద్ద కంకర తరలింపు

నవతెలంగాణ-మోపాల్
మండలంలోని మంచిప్ప గ్రామంలోనీ ప్రాణహిత చేవెళ్ల 21వ ప్యాకేజీ వద్ద కంకర కుప్ప నుండి మోపాల్ మండలానికి చెందిన కొందరు ప్రైవేటు కాంట్రాక్టర్లు రాత్రి సమయంలో అక్రమంగా కంకరను రవాణా చేస్తున్నారు. ఓవర్‌లోడ్ దానికితోడు అతివేగంగా వెళ్లే టిప్పర్ల వల్ల గ్రామస్తులు భయాందోళనకు గురవు తున్నారు. రాత్రి సమయంలో ఎక్కడికైనా వెళ్లాలంటే టిప్పర్ల అతివేగంవల్ల ప్రాణాలు పోయే ప్రమాదం ఉందని గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. ఒకవేళ ఈ కంకర కుప్పలు ఉంటే మళ్లీ తిరిగి ప్రాజెక్టుకు కట్టడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టకుండా ఉంటుంది. ముఖ్యంగా మంచిప్పనే కాకుండా మండలంలోని వివిధ గ్రామాల్లో మొన్నటి వరకు మట్టి తరలింపు తర్వాత మొరం తరలింపు ఇప్పుడేమో కంకర తరలింపు కొనసాగుతోంది.

మండలంలో సహజ సంపదను కొందరు కాంట్రాక్టర్లు నిరంతరం కొల్లగొడుతున్నారు. ముఖ్యంగా రెవెన్యూ వ్యవస్థ అసలు మండలంలో పనిచేస్తుందో లేదో మరి. ఒక నెల క్రితం అక్రమంగా తరలిస్తున్న మొరం ట్రిప్పర్ అతివేగంతో వెళుతూ అదుపుతప్పి కెనాల్‌కు ఢీకొట్టడం జరిగింది. తృటిలో భారీ ప్రమాదం తప్పింది. వాటికి సరైన పత్రాలు లేవు.. డ్రైవర్‌కి డ్రైవింగ్ లైసెన్సు లేదు.. ఒకటనే కాదు రెండు మూడు సందర్భాల్లో అతివేగంతో వెళుతున్న టిప్పర్లు స్కూల్ బస్‌ను కూడా ఢీకొట్టింది. మండలం కాంట్రాక్టర్లకు అడ్డగా మారింది. దాచుకో దోచుకో అన్నట్టు నిరంతరం సహజవనరులను కొల్ల కొడుతూనే ఉన్నారు.



మైనింగ్ అధికారులు, కలెక్టర్ చొరవ చూపాలి



మొన్నటి వరకు ప్రాజెక్టు విషయంలో గ్రామస్తులందరూ ఎన్నో రోజులు నరకయాతన అనుభవించాం. దాని నుండి బయటపడ్డామో.. లేదో.. కొందరు ప్రైవేటు కాంట్రాక్టర్లు తమ ధనార్జన కోసం రాత్రి సమయంలో ప్రాజెక్టుకు సంబంధించిన కంకరను అక్రమంగా రవాణా చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వారి పైన చర్యలు తీసుకోవాలి. మండలంలోని రెవెన్యూ వ్యవస్థ మాత్రం మొద్దు నిద్రలో ఉంది. మైనింగ్ అధికారులు కానీ కలెక్టర్ కానీ ప్రత్యేక చొరవ చూపాలి.
- సాగర్ రైతు, మంచిప్ప.

బైక్ చోరీ


బైక్‌ను చోరీ చేస్తున్న దుండగులు

నవతెలంగాణ-కంఠేశ్వర్
నగరంలోని రెండవ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇంటిముందు నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. వివరాల్లోకి వెళితే నిజామాబాద్ నగరంలోని శివాజీనగర్‌కు చెందిన పుదారి కిరణ్ తన ఇంటి ముందు ద్విచక్ర వాహనం నిలిపి ఉంచారు. గుర్తు తెలియని దుండగులు బుధవారం రాత్రి సుమారు 11గంటల సమయంలో తన ద్విచక్ర వాహనాన్ని ఎవరో చోరి చేసినట్టు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనం


ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న అధికారులు

నవతెలంగాణ-మోపాల్
మండలంలోని న్యాల్కల్ శివారు ప్రాంతంలో బుధవారం రోజు రాత్రి సమయంలో మూడు ట్రాన్స్‌ఫార్మర్‌ల కాపర్ వైర్‌ను దొంగిలించడం జరిగిందని ఏఈ బాబా శ్రీనివాస్ తెలిపారు. రెండు 16 కే.వి కెపాసిటీ ఒకటి, 25 కేవీ కెపాసిటీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లలోని కాపర్లను దొంగిలించడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. అలాగే వాటి విలువ సుమారు రూ.60 వేల పైబడి ఉంటుందని ఆయన తెలిపారు.

దొంగల ముఠా హల్‌చల్

నవతెలంగాణ-కంఠేశ్వర్
నగరంలోని ఆరవ పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగలు హల్చల్ చేశారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని డ్రైవర్స్ కాలానికి చెందిన అబ్దుల్ రహీమన్ అనారోగ్యం నిమిత్తం మంగళవారం రాత్రి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారు. ఈ మేరకు బుధవారం డిశ్చార్జి అనంతరం ఇంటికి వచ్చారు. వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగల గొట్టి ఉన్నట్టు తెలిపారు. ఇంట్లోకి వెళ్లి చూడగా రెండున్నర తులాల బంగారం, ఐదు తులాల వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లినట్టు తెలిపారు. వెంటనే బాధితులు పోలీసులకు సమాచారం అందించగా వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. దొంగతనం జరిగిన స్థలాన్ని పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి

నవతెలంగాణ-కంఠేశ్వర్
జిల్లా కేంద్రంలోని నాలుగవ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు మృతి చెందారని ఎస్సై శ్రీకాంత్ గురువారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. డిచ్‌పల్లి మండల గ్రామానికి చెందిన మహమ్మద్ అతరుల్ల(38) మెడికల్ ఫార్మసిస్ట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. తన భార్య జువేరియా ఉస్మా డెలివరీ నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్ళారు. డెలివరీ తర్వాత ఆసుపత్రిలో ఉన్న మహమ్మద్ అతరుల్ల గురువారం తెల్లారుజామున కాలకృత్యాలు తీర్చుకునేందుకు బాత్రూంకి వెళ్ళారు. ప్రమాదవశాత్తు కాలు జారీ పడినట్టు తెలిపారు. హుటాహుటిన డాక్టర్‌ను సంప్రదించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

ఇందిరమ్మ స్థలాలు గుర్తించండి

నవతెలంగాణ-ముప్కాల్
ఇందిరమ్మ ఇళ్ల స్థలాల పంపిణీలో జరిగిన అన్యాయం, మంజూరైన స్థలాల్లో గుడి, బడి కోరకు వదిలిపెట్టిన 10శాతం స్థలం ఎక్కడుందో గుర్తించి గ్రామానికి న్యాయం చేయాలని బీజేపీ నాయకులు తెలిపారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మార్వో పి.శ్రీకాంత్‌కు వినతిపత్రం అందించారు. ఇందిరమ్మ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు గడ్డం సంతోష్‌రెడ్డి, చిల్క దినేష్, పెంటు గంగాధర్, చిల్క గోపాల్, గోపీనాథ్, గైని శ్రీనివాస్, మ్యాక నర్సయ్య, మాజిత్, కళ్ల స్వామి, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు పంపిణీ

నవతెలంగాణ-కంఠేశ్వర్
వనమహోత్సవంలో భాగంగా నగరంలోని 11వ డివిజన్ 300 క్వార్టర్స్ కాలనీలో నిజామాబాద్ నగర మేయర్ దండు నీతూ కిరణ్ గురువారం మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ అదనపు కమిషనర్ శంకర్, నగర ప్రజలు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు చేపట్టాలి


పిచ్చి మొక్కలను తొలగిస్తున్న కార్మికులు

నవతెలంగాణ-ముప్కాల్
మండలంలోని కొత్తపల్లి గ్రామంలో పారిశుధ్య పనులను ఎంపీవో మహమ్మద్‌గౌస్ గురువారం ఆర్యవేక్షించారు. అందులో భాగంగా పల్లె ప్రకృతి వనం, డంపింగ్ యార్డు, వైకుంఠదామం తదితర ప్రాంతాలను పరిశీలించారు. పంచాయతీ రిజిష్టర్‌లను సైతం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా పారిశుధ్య పనులు ముమ్మరంగా కొనసాగిస్తున్నమన్నారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని పంచాయతీ సెక్రటరీకి సూచించారు. ప్రతి వార్డులో దోమల నివారణ మందు పిచికారి చేయించాలని సూచించారు. కార్యక్రమంలో ఆయన వెంట పంచాయతీ సెక్రటరీ రాజు, పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

షరతులు, కటాఫ్ డేట్ లేకుండా రుణమాఫీ చేయాలి


వినతిపత్రం అందజేస్తున్న పలువురు

నవతెలంగాణ-సిరికొండ
షరతులు, కటాఫ్ డేట్ లేకుండా రైతులందరికి రుణమాఫీ చేయాలని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు రామకృష్ణ డిమాండ్ చేశారు.

మండల కేంద్రంలో గురువారం సిరికొండ మండలంలోని సిరికొండ, తూంపల్లి సొసైటీలతో పాటు కమర్షియల్ బ్యాంకులో సిబ్బంది నిర్లక్ష్యంతో రుణమాఫీ జరగని రైతులకు రుణమాఫీ చేయాలని సొసైటీ ముందు ధర్నా నిర్వంచారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సొసైటీ, బ్యాంకర్స్ సిబ్బంది నిర్లక్ష్యం వహించడం వల్ల వందలాది మంది రైతాంగానికి నిరాశ మిగిలిందని తెలిపారు. రుణం తీసుకున్న రైతుల పేర్లను ఆన్లైన్ చేయడంలో అలసత్వం వహించడంవల్ల రుణమాఫీ రాకుండా పోయిందన్నారు. విషయం తెలిసిన రైతాంగం తీవ్ర ఆందోళనకు గురైతున్నారని తెలిపారు. కట్ ఆఫ్ డేటుతో సంబంధం లేకుండా రైతాంగం అప్పులను తక్షణమే మాఫీ చేయాలని కోరారు. కార్యక్రమంలో మాస్ లైన్ ఆర్మూర్ డివిజన్ సహాయ కార్యదర్శి రమేష్, మాస్ లైన్ ఆర్మూర్ డివిజన్ నాయకులు దామోదర్,బాబన్న, సాయరెడ్డి, మాస్ లైన్ మండల నాయకులు లింబన్న, రమేష్, కిశోర్, బాల్ రెడ్డి,ఎర్రన్న గంగమల్లు తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో వనమహోత్సవం


మొక్కలను పంపిణీ చేస్తున్న మున్సిపల్ కౌన్సిలర్ సంగీత

నవతెలంగాణ-ఆర్మూర్
వన మహోత్సవంలో భాగంగా పట్టణంలోని రంగాచారి నగర్, సంతోష్ నగర్, వడ్డెర కాలనీల్లో మున్సిపల్ కౌన్సిలర్ సంగీత ఖాందేష్ పర్యవేక్షణలో గురువారం ఇంటింటికీ మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ రెండవ వార్డు కౌన్సిలర్ బార్ అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షురాలు, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ మెంబెర్ సంగీతా ఖాందేష్ మాట్లాడుతూ.. మన ప్రాంతమంతా పచ్చగా చెట్లతో నిండాలని రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా వన మహోత్సవ కార్యక్రమం చేపట్టిందని అన్నారు. రు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని, మన ఇంటి సమీపంలో మున్సిపల్ వారు నాటిన మొక్కలకు ఇంటి యజమానులు నీళ్ల పోయాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ నాయకులు ఖాందేష్ సత్యం, ప్రశాంత్, సంతోష్ మున్సిపల్ సిబ్బంది శంకర్, సురేష్, పోశన్న తదితరులు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి అందజేత


విద్యార్థులకు క్రీడా సామగ్రిని అందజేస్తున్న పలువురు

నవతెలంగాణ-(వేల్పూర్) ఆర్మూర్
మండలంలోని మోతే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పదివేల రూపాయల విలువ గల క్రీడా సామాగ్రిని గ్రామ వాస్తవ్యులు జిల్లా రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ డొల్ల రాజేశ్వర్ గురువారం అందజేశారు. ప్రధానోపాధ్యాయులు వైద్య గణేష్, ఫిజికల్ డైరెక్టర్ మంచిర్యాల సురేష్ కుమార్ పాఠశాలకు క్రీడా సామాగ్రి అవసరం ఉందని అడగగానే స్పందించి రాజేశ్వర్ క్రీడా సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించి భవిష్యత్తులో మంచి క్రీడాకారుగా తయారు కావాలని, పాఠశాలకు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వైద్య గణేష్ , రత్నయ్య, నరసింహారావు, శ్రావణశ్రీ, కవిత, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు సురేష్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌గా శ్రీనాథ్ బాధ్యతల స్వీకరణ


శ్రీనాథ్‌ను సన్మానించిన అధ్యాపకులు

నవతెలంగాణ-ధర్పల్లి
ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో భాగంగా మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా శ్రీనాథ్ భిక్కునూర్ నుండి ధర్పల్లి జూనియర్ కళాశాలలో గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ బాధ్యతలు నిర్వహించిన ప్రిన్సిపాల్ రజియొద్దీన్ బాల్కొండకు బదిలీపై వెళ్లినట్లు తెలిపారు. ఈసందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాలను అన్నివిధాలా అన్నిరంగాల్లో ముందు ఉంచుతానని తెలిపారు. ఈసందర్భంగా కళాశాల సిబ్బంది కొత్తగా వచ్చిన తమ ప్రిన్సిపాల్‌ను స్వాగతించి, నిన్నటివరకు బాధ్యతలు నిర్వహించి ప్రిన్సిపాల్ కు ఘనంగా సన్మానించి వీడుకోలు పలికారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

మరమ్మతుల పనులు త్వరగా పూర్తి చేయాలి


పాఠశాలను సందర్శించిన ఎంపిడివో బాలకృష్ణ

నవతెలంగాణ-ధర్పల్లి
అమ్మ పాఠశాలలో విద్యార్థులకు సౌకర్యం కోసం చేపట్టుతున్న మౌలిక వసతుల పనులను త్వరగా పూర్తి చెయ్యాలని ఎంపిడిఓ బాలకృష్ణ ఆదేశించారు. ఈసందర్భంగా ఆయన గురువారం మండలంలోని వాడి, గోవింద్ పల్లి గ్రామాల పాఠశాలలను సందర్శించి అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యత ఉండేలా త్వరగా పూర్తి అయ్యేవిధంగా చూడాలని అన్నారు. ఆయన వెంట ఆయాగ్రామాల కార్యదర్శులు, తదితరులు ఉన్నారు.

హామీలను నెరవేర్చని ప్రభుత్వం

నవతెలంగాణ-ఆర్మూర్
అధికార పగ్గాలు చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను నెరవేర్చలేదని కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు నూతుల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధికార ప్రతినిధి కలిగోట గంగాధర్, పట్టణ అధ్యక్షులు ద్యాగ ఉదయ్, కిసాన్ మోర్చా పట్టణ అధ్యక్షులు శేష గారి లింగం మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేస్తానని చెప్పి 10 శాతం రైతులకు కూడా రుణమాఫీ ఇవ్వకపోవడం సిగ్గుచేటని అన్నారు. రాష్ట్రంలో ఫసల్ బీమా యోజన అమలు చేస్తానని ఇప్పటివరకు చేయలేదని తెలిపారు. రైతులకు గత రబీ సీజన్లో బోనస్ ఇస్తానని చెప్పి ఇవ్వలేదని అన్నారు. హామీలు వెంటనే నెరవేర్చాలని ప్రతి రైతుకు రెండు లక్షల రూపాయల వరకు రుణమాఫీ వెంటనే చేయాలని రాష్ట్ర నాయకులు డిమాండ్ చేశారు. లేకుంటే రైతాంగానికి వెన్నంట ఉండి భారతీయ జనతా కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కిసాన్ మోర్చా నాయకులు లింగం దొడ్లనారాయణ పాల్గొన్నారు.

నూతన ప్రిన్సిపాల్‌గా మొహమ్మద్ రజీయుద్దీన్ అస్లాం


బాధ్యతలు స్వీకరిస్తున్న మొహమ్మద్ రజీయుద్దీన్

నవతెలంగాణ-బాల్కొండ
మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా మొహమ్మద్ రజీయుద్దీన్ అస్లాం గురువారం బాధ్యతలను స్వీకరించారు. ఇది వరకు ఇక్కడ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహించిన ఏ.చిన్నయ్య ఐలాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నూతన ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన రజీయుద్దీన్ అస్లాంకు కళాశాల అధ్యాపకులు శుభాకాంక్షలు తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక


నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి
మండలంలోని కోనసముందర్ గ్రామ అభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా గురువారం ఎన్నుకున్నారు. గ్రామ అభివృద్ధి కమిటీ నూతన అధ్యక్షులుగా కంతి సాయన్న, ఉపాధ్యక్షులుగా ఏలిశాల భూమయ్య, కోశాధికారిగా రాజా గంగారాం, కార్యదర్శిగా కొలిపాక ఎల్లయ్య, సలహాదారులుగా దుంపల వీజయ్ కుమార్, సామ రాజేశ్వర్‌రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాన్ని అభివృద్ధి దిశలో తీసుకవెళ్లేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. ఇందుకు గ్రామస్తులు కూడా సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, వివిధ కులాల సంఘాల సభ్యులు, పాల్గొన్నారు.

ఉద్యోగులకు విరమణ తప్పనిసరి

నవతెలంగాణ-ఆర్మూర్
ప్రభుత్వ ఉద్యోగులకు పదవి విరమణ తప్పనిసరని హైదరాబాద్ పంచాయతీరాజ్ ఈఎంసి కనకరత్నం అన్నారు. డివిజనల్ పంచాయతీరాజ్ కార్యాలయ డిప్యూటీ ఈఈ మూడు బాబురావు నాయక్ ఉద్యోగ విరమణ సన్మాన మహోత్సవ కార్యక్రమం బుధవారం రాత్రి జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ ప్రతి ఒక్క ఉద్యోగి విధినిర్వహణలో ఎన్నో ఒడిదుడుకులను తట్టుకుంటూ నిర్విరామ సేవలు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీరాజ్ ఈఈ బావన్న, పంచాయతీరాజ్ అధికారులు ఇంద్రకరణ్ రెడ్డి, నగేష్ శర్మ ,రామారావు, సురేఖ, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ సూపర్వైజర్ బదిలీ



నవతెలంగాణ-బాల్కొండ
మండల కేంద్రంలోని పీహెచ్‌సీ కిసాన్ నగర్‌లో విధులు నిర్వహిస్తున్న హెల్త్ సూపర్వైజర్ చిలుకవాణి గురువారం మెండోరాకు బదిలీ అయ్యారు. వాణి 01.03.2018 నాడు కిసాన్ నగర్ పీహెచ్‌సీలో హెల్త్ సూపర్వైజర్‌గా విధుల్లో చేరారు. గత ఆరు సంవత్సరాల నుంచి ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన సేవలు అందించారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్లిన చిలుక వాణిని వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ స్రవంతి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కారు పార్కింగ్‌పై గొడవ

నవతెలంగాణ-బాల్కొండ

కారు పార్కింగ్ విషయమై ఇద్దరి మధ్య మాట పెరిగి గొడవకు దారి తీసిన ఘటన మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ మొహమ్మద్ యాసీర్ అరాఫత్ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రంలో జక్క శేఖర్‌కు చెందిన కార్తికేయ ఫ్యాషన్ షాప్ ముందర గత కొన్ని రోజులుగా గ్రామానికి చెందిన యూసుఫ్ తన షిఫ్ట్ కారును పార్క్ చేస్తున్నాడు. దీంతో గిరాకి రావడం లేదని జక్క శేఖర్ యూసుఫ్ దగ్గరకు వెళ్లి కారు పార్కింగ్ చేయవద్దని చెప్పగా ఇద్దరి మధ్య వాగ్వాదం పెరిగి గొడవకు దారి తీసింది. ఇంతలో పక్కనే ఉన్న యూసుఫ్ కొడుకులు ఇర్ఫాన్, ఆవేజ్ వారితో పాటు వాజిద్ అనే వ్యక్తి కలగజేసుకుని జక్క శేఖర్‌ను కొట్టారు అని తెలిపారు. ఈ ఘటనపై శేఖర్ తమ్ముడు రాహుల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి నలుగురిని కోర్టుకు హాజరు పరిచామని ఎస్ఐ పేర్కొన్నారు.

గోవింద్‌పల్లిలో హెల్త్‌క్యాంప్

- డెంగ్యూ వ్యాధి సోకడంతో..

నవతెలంగాణ-ధర్పల్లి

మండలంలోని గోవింద్‌పల్లి గ్రామంలో డెంగ్యూ వ్యాధి సోకినట్టు తెలుసుకున్న అధికారులు మూడురోజులుగా హెల్త్ క్యాంపును ఏర్పాటు చేసినట్టు ఎంపిడిఒ బాలకృష్ణ తెలిపారు. ఈసందర్భంగా గ్రామస్థులకు వ్యాధి పట్ల అహగాహన కల్పిస్తున్నామని అన్నారు. ప్రజలు భయభ్రాంతులకు గురికావద్దని, ఆరోగ్యంపట్ల జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు,సొంత వైద్యం చేసుకోకుండా వైద్యుల సలహాల తీసుకోవాలని ,వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారని భయాందోళనలు చెందవలసిన అవసరము లేదని అన్నారు. ఎప్పటికప్పుడు వైద్యులు గ్రామములో ఉండి అప్రమత్తంగా పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారని అన్నారు. కార్యక్రమములో అయన వెంట వైద్య సిబ్బందితోపాటు, గ్రామపెద్దలు ఉన్నారు.

'స్వచ్ఛదనం-పచ్చదనం' విజయవంతం చేయాలి

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు
- వీసీలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి దిశానిర్దేశం

నవతెలంగాణ నిజామాబాద్ సిటీ

రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 5 నుండి 09 వరకు ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేసేందుకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ.శాంతికుమారి గురువారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. ఐదు రోజుల పాటు చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి వివరించారు. ఈ సందర్భంగా వీ.సీ ముగిసిన అనంతరం కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు వివిధ శాఖల జిల్లా అధికారులతో సమావేశమై, స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గ్రామాల వారీగా ప్రతి జీపీ పరిధిలో, మున్సిపల్ పట్టణాల్లో వార్డుల వారీగా నిర్దేశిత కార్యక్రమాలను చేపట్టేలా స్పష్టమైన కార్యాచరణను రూపొందించు కోవాలని ఆదేశించారు. ఆయా కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి రోజువారీగా నివేదికలు సమర్పించాలని అన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలను, స్థానిక నాయకులను, యువజన సంఘాలను భాగస్వాములు చేస్తూ పంచాయతీ కార్యదర్శులు, ఆశా వర్కర్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వివిధ వర్గాల వారందరు స్వచ్ఛదనం-పచ్చదనంలో పాలుపంచుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమాల నిర్వహణకోసం గ్రామాల వారీగా ప్రత్యేక కమిటీలను నియమిస్తామని, మండల ప్రత్యేక అధికారులుగా వ్యవహరిస్తున్న జిల్లాస్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పకడ్బందీ పర్యవేక్షణ జరపాలని ఆదేశించారు. ఈనెల 5న ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని అట్టహాసంగా చేపట్టాలని, పచ్చదనం, పరిశుభ్రత, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం ఆవశ్యకత గురించి ప్రజల్లో అవగాహన పెంపొందించేలా అన్ని గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించాలని సూచించారు. మొక్కల పెంపకం, పరిసరాల పరిశుభ్రత వంటి అంశాలపై విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ వంటి పోటీలు నిర్వహించాలని అన్నారు. అవకాశం ఉన్న చోట వాల్ రైటింగ్ చేయించాలని కలెక్టర్ సూచించారు. శ్రమదానం కార్యక్రమాన్ని చేపట్టి రోడ్లు శుభ్రం చేయడం, గుంతలు పూడ్చడం వంటి వాటిపై దృష్టి కేంద్రీకరించాలని అన్నారు. ముఖ్యంగా తాగునీటి సరఫరా వ్యవస్థను మరింతగా మెరుగుపర్చే కార్యక్రమాలు చేపట్టాలని, ట్యాంకులను శుభ్రం చేయడం, క్లోరినేషన్, వాటర్ టెస్టింగ్ జరిపించడం, జనావాసాల మధ్య నీరు నిలువకుండా చూడడం, పాఠశాలలు, ఆసుపత్రులు, అంగన్వాడీ కేంద్రాలు, వసతి గృహాలు, బస్టాప్‌లు వంటి ప్రదేశాలలో పరిశుభ్రత కార్యక్రమాలు జరిపించాలని ఆదేశించారు. ముఖ్యంగా దోమల నియంత్రణ చర్యలు చేపడుతూ, ఓపెన్ ప్లాట్ లలో వర్షపు నీరు, మురుగు జలాలు నిలువ ఉండకుండా వాటర్ హార్వెస్టింగ్ అయ్యేలా వివిధ నిర్మాణాలు చేయించాలని సూచించారు. మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అన్ని నివాస ప్రాంతాలకు చెత్తను సేకరించే వాహనాలు వెళ్లేలా చర్యలు తీసుకుని, వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ సిస్టం ద్వారా పర్యవేక్షణ జరపాలన్నారు. అన్ని గ్రామ పంచాయతీలు, వార్డులలో వీధి కుక్కలకు స్టెరిలైజెషన్ చేసేలా చూడాలన్నారు. వనమహోత్సవంలో భాగంగా ప్రతీ చోట పెద్ద ఎత్తున మొక్కలు నాటి, వాటి సంరక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠ ధామాలు, డంపింగ్ యార్డులను, క్రీడా ప్రాంగణాలు, పార్కులను సందర్శించి, ఎక్కడైనా మొక్కలు చనిపోతే వాటి స్థానాలలో కొత్తగా మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని అన్నారు. అన్ని శాఖల అధికారులు పరస్పరం సమన్వయంతో పనిచేస్తూ, జిల్లా వ్యాప్తంగా అన్ని చోట్ల స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, ట్రైనీ కలెక్టర్ సంకేత్, డీఆర్డీఓ సాయాగౌడ్, డీపీఓ చక్రవర్తుల తరుణ్ కుమార్, డీఈఓ దుర్గాప్రసాద్, డీఐఈఓ రవికుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

సామాజిక ఉద్యమాలకు మార్గదర్శి అన్నాబావుసాఠే

నవతెలంగాణ-కంఠేశ్వర్

నేడు భారత దేశంలో జరుగుతున్న సామాజిక న్యాయం సమానత్వం కోసం సాగుతున్న ఉద్యమాలకు బహుజన శ్రామిక ప్రజల మార్గదర్శి, భారత ఉమ్మడి కార్మికోద్యమ నిర్మాతల్లో ఒకరైన అన్నాభావు సాఠే ఆశయ సాధన కోసం ఉద్యమించాలని వక్తలు పిలుపునిచ్చారు. అన్నబావు సాఠే జయంతిని గురువారం చంద్రశేఖర్ కాలనీ బైపాస్ రోడ్డులో అన్నబావు సాఠే సంఘం వారు ఏర్పాటు చేసిన విగ్రహ భూమి పూజ జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ డి.రాజేశ్వర్, బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్, బహుజన లెఫ్ట్ మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ సబ్బని లత, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ భక్తవత్సలం, టీఆర్ఎస్ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఎనగందుల మురళి, బీఆర్ఎస్ నాయకులు దండు శేఖర్ మాట్లాడారు. మహారాష్ట్రలో జన్మించిన అన్నాబావుసాఠే తన జీవిత కాలంలో బహుజన శ్రామిక ప్రజల శ్రమ దోపిడి వ్యతిరేకంగా, కుల దోపిడికి వ్యతిరేకంగా ఉద్యమించారని తెలిపారు. బహుజన ఉద్యమ నిర్మాత లోక్ షాహీర్ అన్నావు సాఠే చరిత్రను కేవలం మరాఠీ భాషలో తప్ప భారతీయ భాషల్లోకి అనువాదం చేయలేదని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం అన్ని భారతీయ భాషల్లోకి అనువదించాలని, మహారాష్ట్ర ప్రభుత్వం వెంటనే పాఠ్యపుస్తకాల్లో ముద్రించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అన్నబావు సాఠే మాదిగ సంఘం జిల్లా అధ్యక్షులు గంగాధర్ గాయక్వాడ్, నగర నాయకులు సాయి కాంబ్లే, కేశావ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



జెండా ఎగురవేస్తున్న నాయకులు

పీహెచ్‌సీలో పలువురు బదిలీ

నవతెలంగాణ-బాల్కొండ

మండలకేంద్రంలోని పీహెచ్‌సీ కిసాన్‌నగర్‌లో విధులు నిర్వహిస్తున్న పలువురు సిబ్బంది బదిలీ అయ్యారు. వీరికి గురువారం సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. పీహెచ్‌సీ హెల్త్ సూపర్వైజర్ చిలుకవాణి మెండోరాకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో మెండోరా నుంచి మేరమ్మ పీహెచ్‌సీలో హెల్త్ సూపర్వైజర్‌గా విధుల్లో చేరారు. బదిలీల్లో జగన్ ఫార్మసిస్ట్ మెండోరా పీహెచ్‌సీకి బదిలీ అయ్యారు. పవన్ మెడికల్ ఆఫీసర్ నిర్మల్ జీజీహెచ్‌కు బదిలీ అయ్యారు. ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన సేవలు అందించి బదిలీపై వెళ్లిన వీరికి వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది వీడ్కోలు పలుకుతూ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ స్రవంతి,డాక్టర్ యశ్వంత్, ఏఎన్ఎం లు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్వోలకు సన్మానం

నవతెలంగాణ-రామారెడ్డి

రామారెడ్డి తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన కె.సువర్ణను బదిలీపై వెళ్తున్న లక్ష్మణ్‌ను మండల నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి, శాలు వాతో సన్మానించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయ కులు పడగల శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు కందూరి పెద్ద లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మార్వోను సన్మానిస్తున్న నాయకులు

భూ సేకరణపై అభ్యంతరాలుంటే తెలపండి

- రెవెన్యూ డివిజనల్ అధికారి రాజాగౌడ్



మాట్లాడుతున్న ఆర్డీవో రాజాగౌడ్

నవతెలంగాణ-ఆర్మూర్

రైతులు జాతీయ రహదారి 63 విస్తరణలో భాగంగా భూములు కోల్పోతున్న వారు భూ సేకరణపై అభ్యంతరాలు ఉంటే తెలుపాలని రెవెన్యూ డివిజనల్ అధికారి రాజాగౌడ్ అన్నారు. గురువారం పట్టణంలోని మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భూ సేకరణ చట్టం ప్రకారం భూ క్రయ విక్రయాల సరాసరి ప్రకారం ధర నిర్ణయం చేస్తామని బేసిక్ విలువ మార్కెట్ విలువ ఎక్కువ తక్కువ తదితర అంశాలను పరిగణలోకి తీసుకొని ధర నిర్ణయం అవుతుందన్నారు. రైతులు ఇంతవరకు పరిహారం కోరుకుంటారో తెలియజేయాలని కోరారు. పట్టణం నుంచి మంచిర్యాల జాతీయ రహదారి కోసం భూసేకరణలో భాగంగా భూములు కోల్పోతున్న పెర్కిట్, కోటార్మూర్, చేపూర్ గ్రామాల రైతులు పాల్గొని, రైతుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ గజానన్, తదితరులు ఉన్నారు.

కోటగిరి తహసీల్దార్‌గా గంగాధర్

నవతెలంగాణ-కోటగిరి

కోటగిరి తహసిల్దార్‌గా గంగాధర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన సునీత నిజామాబాద్‌కు బదిలీ కావడంతో నిజామాబాద్ నుంచి గంగాధర్ కోటగిరికి వచ్చారు. తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది తహసీల్దార్ గంగాధర్‌కు ఘనంగా స్వాగతం పలుకుతూ, తహసీల్దార్ సునీతకు ఘనంగా వీడ్కోలు పలికారు.

ప్రభుత్వాసుపత్రిలో వైద్యులను నియమించాలి

నవతెలంగాణ-దోమకొండ

ప్రభుత్వ ఆస్పతిలో లాంగ్ స్టాండింగ్‌లో బదిలీ అయిన వైద్యులు, స్టాఫ్‌నర్సు, సిబ్బందిని నియమించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహ్మద్ షబ్బీర్ అలీకి దోమకొండ మాజీ జడ్పీటీసీ తీర్మాల్‌గౌడ్, నాయకులు గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దోమకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో ఆయా గ్రామాల నుంచి వందలమంది రోగులు వైద్యం కోసం వస్తున్నారని, వైద్యులు కొరత వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మధు, మధుసూదన్ ఉన్నారు.

ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ తీర్పుపై

ఎమ్మార్పీఎస్ సంబురాలు

- సుప్రీంకోర్టు తీర్పు పట్ల హర్షం

నవతెలంగాణ-విలేకరుల బృందం

కంఠేశ్వర్ : సుప్రీంకోర్టులో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్‌ల వర్గీకరణపై సానుకూలంగా తీర్పు వచ్చినందుకు ఎమ్మార్పీఎస్ (మాదిగ రాజకీయ పోరాట సమితి) ఆధ్వర్యంలో గురువారం నగరంలోని పూలాంగ్ చౌరస్తా వద్ద టపాసులు, బానసంచాలు పేల్చి మిఠాయిలు పంచుకుంటూ హర్షం వ్యక్తం చేస్తూ సంబరాలు చేసుకున్నారు. ఎమ్మార్పీఎస్ యొక్క సుదీర్ఘ 30 ఏళ్ల ఉద్యమ ఫలితమే సుప్రీంకోర్టులో ఎస్సీ రిజర్వేషన్‌ల వర్గీకరణను రాష్ట్రాల వారిగా చేసుకోవచ్చని సుప్రీంకోర్టులోని ఏడుగురు జడ్జిల బెంచ్ ఇచ్చిన తీర్పు 6:1గా ఎస్సీ రిజర్వేషన్లను ఏ,బి,సి,డి,లుగా వర్గీకరిస్తూ రాష్ట్రాలకు అప్పగిస్తూ తీర్పు ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా ఇన్చార్జ్ గంధమాల నాగభూషణం, జిల్లా అధ్యక్షులు డల్ల సురేష్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ పోరాట ఫలించినందుకు చాలా ఆనందంగా ఉందని, మాదిగ దండోరా యొక్క సుదీర్ఘ పోరాటంలో మా జాతి బిడ్డల భవిష్యత్తుకై జరిగినటువంటి పోరులో పాల్గొన్నందుకు తాము నిజంగా గర్విస్తున్నామని తెలిపారు. ప్రధానమంత్రి మోడీ ఆశీస్సులతోటే సుప్రీంకోర్టులో తీర్పు వచ్చిందని, అందుకు నరేంద్రమోడీకి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. సుప్రీంకోర్టులో తీర్పు ఇచ్చిన వెంటనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యంగా సీఎం రేవంత్‌రెడ్డి చొరవ తీసుకొని సుప్రీంకోర్టు తీర్పును ఎస్సీ రిజర్వేషన్‌ల వర్గీకరణపై పూర్తిగా అమలు చేస్తామని హామీ ఇవ్వడం, ప్రస్తుతం ఉద్యోగ నోటిఫికేషన్‌లో కూడా ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకొచ్చి అమలు చేస్తామని చెప్పడం, మాదిగల పట్ల రేవంత్‌రెడ్డికి ఉన్నటువంటి ప్రత్యేక శ్రద్ధ వారి మాటల్లో కనబడుతుందని అందుకు తాము ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ప్రధాన కార్యదర్శి రాజేంద్ర మాదిగ, మాదిగ విద్యార్థి ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు మల్లాని శివ మాదిగ, యువసేన జిల్లా అధ్యక్షుడు మట్టల దీపక్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి కిష్టయ్య మాదిగ, జిల్లా కార్యవర్గ సభ్యుడు కనిగేకర్ గంగాధర్ మాదిగ, మహిళా నాయకురాలు సుధా మాదిగ, ఎమ్మార్పీఎస్ టౌన్ నాయకులు సుమన్ మాదిగ, శీను మాదిగ, మల్లేష్ మాదిగ, యాదగిరి మాదిగ, గణేష్ మాదిగ, సాయిలు మాదిగ, తదితరులు పాల్గొన్నారు.



కంఠేశ్వర్ : సంబరాలు చేసుకుంటున్న నాయకులు

ఇబ్రాన్‌పల్లి : మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు శ్యామ్ మాదిగ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో ఆనందాన్ని వ్యక్తం చేస్తూ స్వీట్లు తినిపించుకున్నారు. 30 ఏళ్లగా మందకృష్ణ మాదిగ నాయకత్వంలో 1994 ప్రకాశం జిల్లా ఈదుమూడి అని గ్రామంలో ప్రారంభమైన ఎమ్మార్పీఎస్ ఉద్యమం అంచెలంచెలుగా ఎదిగి ఎన్నో ప్రతిష్టాత్మక ఉద్యమాలు నిర్మించిందని పేర్కొన్నారు. ఈ సందర్భంలో నేడు వర్గీకరణపై సుప్రీంకోర్టులో ఏడుగురు జడ్జిల్లా ధర్మాసనం ఇచ్చిన తీర్పు మాదిగ సమాజానికి ఎంతో ఆనందాన్ని నింపిందన్నారు. 30 ఏళ్లగా ఉద్యమానికి సహకరించిన సబ్బండ వర్గాల ప్రజలకు సామాజిక వాదులకు పాత్రికేయ మిత్రులు, ఉద్యమకారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో సంకేపల్లి విప్లవ, గట్టు రాజేష్, దినేష్, చింటూ, తదితరులు పాల్గొన్నారు.

నవీపేట్: సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇవ్వడం పట్ల ఎమ్మార్పీఎస్ నాయకులు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేసి గురువారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంఆర్పిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకారం రమేష్ మాట్లాడుతూ.. 30 సంవత్సరాల సుదీర్ఘ పోరాటం, ఎన్నో అణిచివేతలు, అడ్డంకులు, అవరోధాలను తట్టుకొని మాదిగ ఉపకులాలకు రావలసిన ఫలితాలను సుప్రీంకోర్టు తీర్పు ద్వారా సాధించడం మందకృష్ణ మాదిగ ఉద్యమ ఫలితమని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కుమార్, ప్రసాద్, హరీష్, యాదగిరి, పోశెట్టి, లక్ష్మణ్, విజయ్, వినోద్, సతీష్, రవి తదితరులు పాల్గొన్నారు.



నవీపేట్ : పాలాభిషేకం చేస్తున్న నాయకులు

కాచం కృష్ణమూర్తి స్ఫూర్తితో పోరాడాలి

- వ్యకాస ఆధ్వర్యంలో నివాళి

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరుడు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ప్రారంభ నాయకుడు కాచం కృష్ణమూర్తి 18వ వర్ధంతిని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది వెంకట్రాములు మాట్లాడుతూ.. తెలంగాణ పోరాటంలో పనిచేసిన ఘనతే కాకుండా వీర తెలంగాణ రైతాంగ పోరాటంలో విరోచితంగా పోరాటమే కాకుండా వ్యవసాయ కార్మిక సంఘం నిర్మాతలలో కూడా ఒకరుగా ఉంటూ వ్యవసాయ కార్మికుల అభివృద్ధి, సంక్షేమం కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడిన గొప్ప మహావీరుడు కామ్రేడ్ కాచం కృష్ణమూర్తి అని అన్నారు. ఆయన వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడుగా, ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షునిగా, కార్యదర్శిగా కూడా పని చేశారని తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా జనగామ తాలూకా దేవరుప్పుల ప్రాంతానికి చెందిన నీరుమాల గ్రామంలో మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన కృష్ణమూర్తి అనేక పోరాటాలు చేసి జీవితాంతం ప్రజల కోసం పనిచేశారని అన్నారు. నిజామాబాద్ జిల్లాతో ఆయన అనేక సంబంధాలు ఉన్నాయని, ఎస్ఎస్ఎఫ్ భూముల పంపిణీలో ఆయన కీలకపాత్ర పోషిస్తూ సమరశీల పోరాటాలు చేసి ఆ భూములను పేద ప్రజలకు 6000 ఎకరాల పంచిన మహనీయుడని అన్నారు. ఆయన ఆశ సాధన కోసం నేడు వ్యవసాయ కార్మికుల్లో వస్తున్న మార్పులు, గ్రామీణ శ్రామికులలో వస్తున్న మార్పులని పరిశీలించి. విశ్లేషించి అధ్యయనం చేసి వారి సమస్యల పరిష్కారం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష - కార్యదర్శులు ఏశాల గంగాధర్, పెద్ది వెంకట్రాములు, సంఘం నాయకులు బొర్ర సత్యనారాయణ, గోశం లక్ష్మి, నాగుల గోవర్ధన్, నర్రా శంకర్, కదం రాజు, పిండి రాజేశ్వరి, శిఖరి శీను అలాగే విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు వజ్జా వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



నివాళ్లు అర్పిస్తున్న నాయకులు

IN THE COURT OF THE FAMILY COURT CUM IV ADDLDISTRICT & SESSIONS JUDGE : MEDAKAT SANGAREDDY

I.A No. 398 OF 2024
IN
O.S.No. 04 OF 2012

BETWEEN :
T. Deepak Kumar. ....Plaintiff
AND
To The District Collector & others. .... Defendants

To
2. Smt. B. Sujatha W/o B.Ashok Reddy, D/o Late. P. Janga Reddy, Aged: 45 yrs, Occ: House Hold, R/o Vegulakatta Are, Nizamabad.
.....Respondents/Proposed Defendant No.6 & 8 to 11

Whereas the Plaintiff filed the above suit seeking the relief of declaration against the defendants in the above I.A No.398/2024 the Hon'ble court is posted for appearance of the Respondents, and the said I.A No.398/2024 is posted on 06/08/2024 for your appearance. You are hereby required to appear on that day at 10.30 a.m either in person or through pleader, failing which the matter will be proceeded as per law.

(BY ORDER OF THE COURT)
G.Madhavi
Advocate
Sangareddy

IN THE COURT OF THE HON'BLE PRL. JUNIOR CIVIL-JUDGE AT BODHAN
OS No. 260 OF 2023

Between:-
1. Shri. Kaparaveni Srinivas S/o. Late Mallaiah Venkaiah @ Venkaiah, Caste: Gangaputra, Religion: Hindu, aged about 48 years, Occ: Pvt. Employee, R/o. H. No. 4-1-595/1/A/1, Shakkarnagar X Road, Bodhan, Dist. Nizamabad, Cell No. 7382929704.
2. Sri. Kaparaveni Kumara Swamy S/o. Late Mallaiah Venkaiah @ Venkaiah, Caste: Gangaputra, Religion: Hindu, aged about 44 years, Occ: Pvt. Employee, R/o. H. No. 4-1- 581/2, Shakkarnagar X Road, Bodhan, Dist. Nizamabad, Cell No. 7382929704.

FULL DESCRIPTION OF THE DEFENDANTS:
1. The Manager, Core Committee of Nizam Sugars Limited, Shakkarnagar, Bodhan, Dist. Nizamabad.
2. To whomsoever it may concern

PUBLICE NOTICE

WHOME SO EVER IT MAY CONCERN TAKE NOTICE in the above Suit for declaration O.S.No.260 of 2023. filed by the plaintiffs for suit for declaration they are the successors of Late: Late:Mallaiah Venkaiah @ Venkaiah S/o Late: venkataiah, with regards to House Plot No.1171 admeasuring 200 Sq. Yeards in Sy.No.646 to705 situated at Achanpally Revenue locality of Bodhan Revenue Mandal now merged in Bodhan municipality belongs to the Defendants Company.

The above case is posted for 23-08-2024. For the appearance before the above said Hon'ble court and if anybody has any objection to be made before the court on 23-08-2024 at 10.30. A.M falling which the matter will be decided exparte.

// BY THE ORDER OF THE COURT //
DATE: 01-08-2024
PLACE: BODHAN
Sd/-
SSR. KOTESHWARA RAO
ADVOCATES, BODHAN